ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
చిత్తూరు
జిల్లా వార్తలు
గురువారం 11 ఏప్రిల్ 2024



వైసీపీ ఆశలకు రాజీనామాలకు బ్రేక్

చంద్రబాబు పదివేల వేతనం ప్రకటనతో డైలమాలో వలంటీర్లు

గత రెండేళ్ళుగా వైసీపీ ప్రభుత్వం వలంటీర్లతో వెట్టిచాకిరీ చేయించుకుంది. పేరుకు ప్రభుత్వ గౌరవ ఉద్యోగమే కానీ ఎక్కడికక్కడ స్థానిక వైసీపీ నాయకుల కనుసన్నల్లో వీరు పనిచేయాల్సి వచ్చింది. ఇంత చేసినా వేతనం అతి తక్కువ. ఎన్నికల్లో ప్రభుత్వం మారితే.. తమ భవిష్యత్తు ఏమిటన్న ఆందోళన వీరిలో ఉంది. దీన్నే వైసీపీ అనుకూలంగా మార్చుకుంది. టీడీపీ అధికారంలోకి వస్తే వలంటీర్లు ఉండరని నమ్మబలికింది. ఇదే సమయంలో వైసీపీ నేతల వెంట ప్రచారంలో ఉన్న వలంటీర్ల సమాచారం ఫొటోలు సహా వెలుగులోకి రావడంతో వీరిపై చర్యలు తీసుకుంటున్నారు. 'మీకిక మరోదారి లేదు.. రాజీనామాలు చేసి వచ్చేయండి ఈ రెండు నెలలూ రెట్టింపు జీతాలు ఇస్తాం' అని ఆ పార్టీ నాయకులు ఎర వేయడంతో వలంటీర్లు కూడా మూకుమ్మడిగా రాజీనామాలు చేసేయడం మొదలు పెట్టారు. చిత్తూరు జిల్లాలో 108 వార్డు, 504 గ్రామ సచివాలయాల చొప్పున మొత్తం 612 ఉన్నాయి. వీటి పరిధిలో 9400 మంది వలంటీర్లు పనిచేస్తున్నారు. వారిలో గత నెల ఎన్నికల షెడ్యూలు వెలువడిన తర్వాత ఇప్పటి వరకు 1700 మంది వలంటీర్ల రాజీనామాలకు కలెక్టరు ఆమోదం తెలిపారు. ఎంపీడీవోల వద్ద మరో 300 దరఖాస్తులు విచారణలో ఉన్నట్లు సమాచారం. ఇక, ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారని పలువురు వలంటీర్లను తొలగించారు. జిల్లాకు సంబంధించి కుప్పం, పుంగనూరు వంటి నియోజకవర్గాల్లో వలంటీర్లపై వైసీపీ నేతలు తీవ్రమైన ఒత్తిళ్లు తెచ్చి రాజీనామాలు చేయించారు. కుప్పంలోనే దాదాపు 1110 మందిచేత వైసీపీ నేతలు రాజీనామాలు చేయించడమే దీనికి నిదర్శనం. ఈ క్రమంలో చంద్రబాబు ప్రకటనతో వలంటీర్లు ఆలోచనలో పడ్డారు. కాస్తో కూస్తో చదువుకున్న అనేకమంది, అందులోనూ మహిళలు వలంటీర్లుగా చేరారు. స్థానికంగా ఉండే వైసీపీ నాయకుల అండదండలతోనే ఎక్కువమంది ఈ కొలువుల్లో కుదురుకున్నారు.ఈ నాయకుల రుబాబు ఎక్కువైనా మౌనంగా భరిస్తున్నారు. ఉన్న చోటనే ఆ కాస్త డబ్బులైనా వస్తున్నాయనే సంతృప్తితో పనిచేస్తున్నారు. కరడుగట్టిన వైసీపీ అనుచరులు మినహా, ఇటువంటి వారిలో చంద్రబాబు ప్రకటన కొత్త ఆశను చిగురింపజేసింది. పదివేలు అంటే తక్కువేమీ కాదు. పైగా వలంటీరు వ్యవస్థ కొనసాగుతుందని చెబుతున్నారు. ఈ నెల రోజులూ రాజీనామా చేయకుండా, ఏదోలా సాగదీసేస్తే చాలు కదా అనుకుంటున్నారు. రాజీనామా చేసేయాలనే నిర్ణయం తీసుకున్న వారు కూడా పునరాలోచనలో పడుతున్నారని తెలిసింది. ఈ క్రమంలో బుధవారం పులిచెర్ల మండలం మినహా మరెక్కడా ఎవరూ రాజీనామా చేయలేదు. ఇక, రాజీనామాలు చేసిన వారూ అంతర్మథనం చెందుతున్నారు. దీన్నిబట్టి చూస్తే ఎన్నికల్లో ఎడాపెడా వాడేద్దాం అనుకున్న వలంటీర్లు వైసీపీ ఆశించినట్టుగా ఉపయోగపడేట్టు లేరు. అయితే చంద్రబాబు మాటలు నమ్మొద్దు అని వైసీపీ నాయకులు వీరి వెంటపడుతున్నట్టు తెలుస్తోంది. వలంటీర్లకు పది వేలు ఇస్తామన్న హామీని ఎన్నికల మేనిఫెస్టోలో పెడితే తమకు మరింత నమ్మకం కలుగుతుందని కొందరు వలంటీర్లు అంటున్నారు. ఇదే జరిగితే వలంటీరు వ్యవస్థ మొత్తం వైసీపీని వదిలి చంద్రబాబు వైపు చేరే అవకాశం ఉందంటున్నారు.


మామిడికాయలకు కట్టిన రక్షిత తొడుగులు

కవర్లు కట్టి కాపాడుకుంటే..!

- మామిడికి అత్యధిక ధరలు

మామిడికి గిట్టుబాటు కావాలంటే కాయలకు కవర్లు కట్టాలి. తద్వారా వడగళ్లు, ఊజీ ఈగల నుంచి మామిడి కాయలను కాపాడుకోవాలి. అలా భద్రం చేసుకుంటే పల్ప్‌ఫ్యాక్టరీలు ఇచ్చే ధరకంటే వీటికి ఎక్కువ పొందవచ్చు.
- పలమనేరు

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో దాదాపు 2.5 లక్షల ఎకరాల్లో మామిడి తోటలున్నా ఈ ఏడాది కేవలం 30 శాతం మాత్రమే దిగుబడి వస్తుందని రైతులు అంటున్నారు. ఇటీవల కాలంలో మామిడికి ఊజీ ఈగ కాటు వేస్తోంది. ఈ క్రమంలో కాయ పక్వ దశకు వచ్చి మామిడి కోత కోసి.. మాగిన సందర్భంగా మామిడి పండును కోయగానే అందులోంచి ఊజీ ఈగలు పెట్టిన గుడ్లు పురుగుల రూపంలో కనిపిస్తోంది. దీంతో ఆ మామిడి పండ్లను పారబోయాల్సి ఉంటుంది. దీనివల్ల నష్టపోతున్నారు. ఈ ఊజీ ఈగల నుంచి రక్షణగా మామిడి కాయలకు రక్షిత తొడుగులు వినియోగించాలని ఉద్యానవన శాఖ అధికారులు చెబుతున్నారు. అందుకని మామిడి వ్యాపారులు ఇటీవలి కాలంలో రక్షిత తొడుగులున్న మామిడి తోటలకు మొదటి ప్రాధాన్యమిచ్చి కాయలు కొంటున్నారు. బంగినపల్లి, (బేనిషా), మల్లిక, ఇమాంపసందు, మల్గూబా వంటి రకాలకు రైతులు రక్షిత తొడుగులు కట్టుకొంటే వాటికి అత్యధిక ధరలు లభిస్తాయని అధికారులు అంటున్నారు. మిగిలిన మామిడి రకాలు ఎక్కువగా పల్పు ఫ్యాక్టరీలకు విక్రయిస్తుంటారని, వాటికి రక్షిత తొడుగులు కట్టడం వల్ల రైతులకు పెద్దగా లాభసాటిగా వుండదన్నారు.



మామిడి కాయలకు కట్టే కవర్లు

వడగళ్ల వాన నుంచీ రక్షణ

మామిడి బాగా పక్వానికి వచ్చి మరో 20 రోజుల్లో కోతకు వచ్చే దశలో వుండగా తొలకరి వర్షాలు ప్రారంభమవుతాయి. ముఖ్యంగా మేనెలలో ప్రారంభమయ్యే వర్షాలు అధిక గాలితోను, వడగళ్లతో వర్షాలు కురుస్తాయి. మామిడికి చివరి దశలో వడగళ్ల వాన వలన రాలిపోవడం ఒక నష్టం అయితే చెట్టులో ఉన్న కాయలు వడగళ్ల దెబ్బలకు పక్వానికి వచ్చిన దశలో మచ్చలు ఏర్పడి మామిడి రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తాయి. అయితే రక్షిత కవర్లు కట్టిన మామిడి కాయలకు వడగళ్ల వాన కురిసినా ఎటువంటి నష్టం వుండదు.

సబ్సిడీ ధరలకు సరఫరా చేయాలి

కొన్నేళ్లుగా మామిడికి గిట్టుబాటు ధరలు అందక రైతులు సతమతమవుతున్నారు. అంతేకాక మామిడి తోటల నిర్వహణ వ్యయం కూడా ఏటా పెరిగిపోతోంది. పెరిగిన క్రిమిసంహారక మందులు, కూలీల ధరల కారణంగాను, పూత సక్రమంగా రాకపోవడం, ఒక వేళ పూత వచ్చినా పిందెలు రాకపోవడం, పిందెలు వచ్చినా ఎండల కారణంగా అధిక శాతం రాలిపోవడం వలన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇదే సమయంలో మామిడి కాయలకు రక్షిత తొడుగులు వేయాలని అధికారులు చెబుతున్నప్పటికీ వాటి కొనుగోలుకు వేలాది రూపాయలు వెచ్చించాల్సి వస్తోందని రైతులు అంటున్నారు. కేవలం ఒక రక్షిత తొడుగు ధర కనీసం రూ.1.5 నుంచి 1.75 పైసల ధర పలుకుతోంది. మామిడి తోటలోని కాయలన్నింటికీ రక్షిత తొడుగులు కట్టాలంటే ఎకరాకు కనీసం లక్ష రూపాయలున్నా చాలదని వారంటున్నారు. కావున ప్రభుత్వం కనీసం మామిడి రైతులకు రక్షిత తొడుగులను సబ్సిడీతో సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.


పీసీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని స్పాట్ కేంద్రం

టీచర్లకు జగనన్న 'స్పాట్'!

- ఇప్పటికీ 40 శాతం మందికి అందని గతేడాది మూల్యాంకన పారితోషికం
- ఈ ఏడాది ఎప్పుడిస్తారో తెలియని వైనం
- స్పాట్ విధులకు తగ్గిన ఆసక్తి

అప్పులతో సాగుతున్న జగనన్న పాలన ప్రభావం.. పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనంపైనా పడింది. మూడేళ్లుగా సరిపడా నిధులు మంజూరు చేయడంలేదు. గతేడాది 'స్పాట్ వాల్యుయేషన్'లో పాల్గొన్న వారిలో 40 శాతం మంది టీచర్లకు ఇంకా టీఏ, డీఏలు ఇవ్వలేదు. జగనన్న 'స్పాట్' దెబ్బతో మూల్యాంకన విధులను తప్పించుకునేందుకు ఎక్కువ మంది టీచర్లు కారణాలు, సిఫార్సులు వెతుక్కునే పరిస్థితి నెలకొంది.

- చిత్తూరు (సెంట్రల్)

చిత్తూరులో పదో తరగతి పబ్లిక్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం నిర్వహిస్తారు. జిల్లాల విభజన తర్వాత రెండేళ్లుగా జరిగే స్పాట్‌కు 1600 నుంచి 1700 మంది టీచర్లు ఎనిమిది రోజుల పాటు విధులు నిర్వహిస్తారు. ఇందుకు గాను దాదాపు రూ.80 లక్షలు అవసరం. ఇందులో రూ.20 లక్షల వరకు బెంచీలు, కుర్చీలు, ఫ్యాన్లు, లైట్లు, తాగునీరు, ప్రాంగణంలో షామియానాలు, మైక్‌సెట్, సీసీ కెమెరాల ఏర్పాటు, స్ట్రాంగ్ రూం, రవాణా, ఇతర నిర్వహణకు ఖర్చవుతాయి. మిగిలిన రూ.60 లక్షల్లో స్పాట్ విధుల్లో పాల్గొనే టీచర్ల టీఏ, డీఏ, మూల్యాకంనం చేసిన జవాబు పత్రాలకు పారితోషికాలు చెల్లించాలి. అయితే, మూడేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం సరిపడా నిధులు విడుదల చేయడంలేదు. మూడేళ్ల కిందట స్పాట్ విధుల్లో పాల్గొన్న టీచర్లకు టీఏ, డీఏతో పాటు స్క్రిప్టు పేపర్ మూల్యాంకనం చేసినందుకు వారి ఖాతాల్లో నగదు జమ చేశారు. కానీ, నిర్వహణ నిధులు పూర్తి స్థాయిలో రాలేదు. ఇక, గతేడాది నిర్వహణ నిధులు రూ.20 లక్షలు రావాల్సి ఉంది. అలాగే, మూల్యాంకనంలో పాల్గొన్న టీచర్లలో దాదాపు 40 శాతం మందికి ఇంకా టీఏ, డీఏ, మూల్యాకనం నిధులు రాలేదు. తాజాగా ఇటీవల జరిగిన టెన్త్ మూల్యాకనంలో నిర్వహణ నిధులు రాలేదు. అత్యవసర పరిస్థితుల్లో వినియోగించే నిధులను పరీక్షల విభాగం అధికారులే సమీకరించుకుని సర్దుబాటు చేసుకుంటున్నట్లు సమాచారం.

టీడీపీ ప్రభుత్వ హయాంలో..

తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు టీచర్లకు రోజువారి మొత్తాలతో పాటు టీఏ, డీఏలను స్పాట్ కేంద్రంలోనే నగదు రూపంలో చెల్లించే వారు. 2017-18లో నగదు రూపంలో చేతికి ఇవ్వకపోయినా, టీచర్ల ఖాతాల్లో బిల్లులు పెట్టిన తక్షణం నగదు జమ చేశారు. 2018-19లో సెంట్రల్ ఫండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (సీఎఫ్ఎంఎస్)ను తెరపైకి తెచ్చిన అప్పటి ప్రభుత్వం, బిల్లులు పెట్టిన వారం రోజుల్లో ఇటు టీచర్ల ఖాతాల్లో నిధులు జమచేయగా, అటు నిర్వహణ నిధులు తక్షణం విడుదలయ్యేవి.

సారూ.. ఆ విధులు మాకొద్దు

- టీచర్లలో నిరాశ...

దూర ప్రాంతల నుంచి ఎంతో వ్యవప్రయాసలకు ఓర్చి చిత్తూరుకు వచ్చి జవాబు పత్రాలు మూల్యాకనం చేయాలి. దీనికి డబ్బులు ఎప్పుడు ఇస్తారనేది తెలియని పరిస్థితి. అందుకనే.. వివిధ కారణాలు చూపుతూ టీచర్లు స్పాట్‌కు దూరమవుతున్నారు. ఈ ఏడాది దాదాపు 251 మంది వివిధ కారణాలతో స్పాట్‌కు దూరం కాగా, గతేడాది ఈ సంఖ్య దాదాపు 300 ఉంది.

'స్పాట్' సిబ్బందికి రోజువారి చెల్లించే పారితోషికం ఇలా..

స్పాట్ క్యాంపు అధికారికి రూ.578, డిప్యూటీ క్యాంపు అధికారి (స్ట్రాంగ్‌రూం) రూ.495, డిప్యూటీ క్యాంపు అధికారి (అడ్మిన్) రూ.495, అసిస్టెంట్ క్యాంపు అధికారి రూ.429, చీఫ్ ఎగ్జామినర్ రూ.396, అసిస్టెంట్ ఎగ్జామినర్ (స్క్రిప్టు పేపరుకు) రూ.10 (రోజుకు 40 పేపర్లు) స్పెషల్ అసిస్టెంట్‌కు రూ.300, క్లరికల్ అసిస్టెంట్ రూ.132, ఆఫీసు సబార్డినేట్ రూ.83, చీఫ్ కోడింగ్ అధికారి రూ.330, అసిస్టెంట్ కోడింగ్ అధికారి రూ.297, ట్యారింగ్ పార్టు ఆఫ్ ఓఎంఆర్ (ఒక్కంటికి) 0.30 పైసలు, ఎగ్జామినర్ ఫర్ ప్రిపేరింగ్ ప్రిన్సిపల్స్ ఆఫ్ వాల్యుయేషన్ రూ.375.


పుంగనూరులోని రాతి మసీదుకు విద్యుద్దీపాలంకరణ

నేడు రంజాన్

చిత్తూరు కల్చరల్/పుంగనూరు రూరల్, ఏప్రిల్ 10: గత 30 రోజులుగా ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లింలు గురువారం రంజాన్‌తో విరమించనున్నారు. బుధవారం ఆకాశంలో చంద్రుడు కనిపించడంతో గురువారం రంజాన్ పండుగను జరుపుకోవాలని జిల్లా ప్రభుత్వ ఖాజీ కమలుల్లా జుహరారి తెలిపారు. రంజాన్ ప్రార్థనల కోసం చిత్తూరు నగరం గిరింపేట ఈద్గా మైదానంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. కాగా, శేషాపిరాన్ మసీదులో మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం ఇఫ్తార్ విందు జరిగింది. అలాగే, జిల్లా వ్యాప్తంగా మసీదులను విద్యుత్ దీపాలతో అలంకరించారు. రంజాన్ ప్రార్థనల కోసం పుంగనూరులోని ఎన్ఎస్‌పేట, తోపుమఠం ప్రాంతాల్లోని ఈద్గాలను సిద్ధం చేశారు. జిల్లాలోని ఈద్గాల వద్ద తాగునీరు వవసతి, పరిశుభ్రత చర్యలు చేపట్టారు.

వైద్య శిబిరంలో వైసీపీ రాజకీయం!

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 10: ఉచిత వైద్య శిబిరాన్నీ వైసీపీ రాజకీయం చేసింది. తమను కాదని.. టీడీపీ నేతలు రావడంపై ఆగ్రహించింది. దీంతో కొంతమందికి మాత్రమే వైద్యం చేసిన వైద్యులు, సిబ్బంది.. తర్వాత వెళ్లిపోయారు. నగరి పట్టణ పరిధిలోని చింతలపట్టెడలో బుధవారం చోటుచేసుకున్న ఈ ఘటనపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి. చింతలపట్టెడలో బుధవారం ఓ ప్రైవేటు ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. దీనిని స్థానికంగా పర్యవేక్షించిన టీడీపీ నేతలు.. గాలి భానుప్రకాష్‌ను ఆహ్వానించారు. ఈ వైద్యశిబిరంపై ప్రచారం చేయడంతో.. పరిసరాల నుంచి చాలా మంది అక్కడికి చేరుకున్నారు. వైద్య పరీక్షలు ప్రారంభించారు. కాగా, గాలి భానుప్రకాష్ వస్తున్నారనే విషయం తెలిసి.. స్థానికుడైన వైసీపీ నేత, మున్సిపల్ చైర్మన్ మంత్రి రోజాకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. దీనిపై ఆమె ఫోనుచేసి ప్రైవేటు ఆస్పత్రి వారిపై ఆగ్రహం వ్యక్తంచేసినట్లు ప్రచారం జరిగింది. వైద్యులు, సిబ్బంది అర్థంతరంగా వైద్య శిబిరాన్ని ఆపేసి వెళ్లిపోవడం.. ఈ ప్రచారానికి బలం చేకూర్చింది. వైద్య శిబిరానికి జనాన్ని పిలిపించి.. కొందరికి మాత్రమే వైద్య పరీక్షలు చేసి వెళ్లిపోవడం.. దీనికి మంత్రి రోజా కారణమని తెలిసి స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. కాగా, అనంతరం చింతలపట్టెకు చేరుకున్న నగరి టీడీపీ అభ్యర్థి భానుప్రకాష్.. అక్కడ రోగులకోసం టీడీపీ నేత బాబు ఏర్పాటు చేసిన భోజనాన్ని వడ్డించి వెళ్లారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మీరా, జయపాల్ తదితరులు పాల్గొన్నారు.


రోగులకు అన్నదానం చేస్తున్న భానుప్రకాష్ తదితరులు

19లోపు పీఈటీల అభ్యంతరాలు తెల్పండి

చిత్తూరు (సెంట్రల్), ఏప్రిల్ 10: డీఎస్సీ-2018లో స్పోర్ట్స్ కోటా కింద దరఖాస్తు చేసుకుని, వెరిఫికేషన్ పూర్తి చేసిన పీఈటీ అభ్యర్థుల వివరాలు డీఈవో కార్యాలయంలోని నోటీసు బోర్డులో ఉంచినట్లు డీఈవో దేవరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబితాను పరిశీలించుకుని ఏవేని అభ్యంతరాలు ఉన్నట్లయితే ఈనెల 19వ తేదీ సాయంత్రం 4 గంటలలోపు డీఈవో కార్యాలయంలో తెలియజేయాలని కోరారు. గడువు తర్వాత వచ్చే అభ్యర్థనలు స్వీకరించబడవని డీఈవో స్పష్టం చేశారు.

రూ.7.86 లక్షల నగదు సీజ్

చిత్తూరు, ఏప్రిల్ 10: ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా డబ్బులను తీసుకొచ్చిన ఇద్దరు వ్యక్తుల నుంచి రెండో పట్టణ పోలీసులు, ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది నగదును స్వాధీనం చేసుకున్నారు. సీఐ ఉలసయ్య వివరాల మేరకు... వాహనాల తనిఖీలో భాగంగా బుధవారం గాంధీరోడ్డుకు చెందిన శరవణ వద్ద రూ.7 లక్షలు, అఫ్రోజ్‌ఖాన్ రూ.86వేలు తీసుకొస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద డబ్బులకు సంబంధించి సరైనా బిల్లులు లేనందున మొత్తం రూ.7.86 లక్షలను సీజ్ చేసి ట్రెజరీలో డిపాజిట్ చేశారు. డబ్బులకు సంబంధించిన బిల్లులను చూపిస్తే డబ్బులను తిరిగి ఇచ్చేస్తామని సీఐ తెలిపారు.

ప్రచారాలు, ఫ్లెక్సీల ఏర్పాటుకు ముందస్తు సమాచారం ఇవ్వండి

● ఎస్పీ మణికంఠ చందోలు


ఎన్నికల ప్రక్రియ గురించి వివరిస్తున్న కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 10: రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రచారాలు, ఫ్లెక్సీల ఏర్పాటు కోసం ముందస్తుగా స్థానిక పోలీసుస్టేషన్ లోని అధికారులకు సమాచారం ఇవ్వాలని ఎస్పీ మణికంఠ చందోలు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో కలెక్టర్ షన్మోహన్ అధ్యక్షతన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం జరిగింది. ఎస్పీ మాట్లాడుతూ ప్రచారాల సమయంలో పార్టీల మధ్య ఘర్షణ వాతావరణం లేకుండా ముందస్తుగా వేర్వేరు సమయాలు పార్టీలకు కేటాయిస్తామన్నారు. ఓటర్లలో మనోధైర్యం కల్పించేందుకై ఏడు కంపెనీల ప్రత్యేక దళాలు జిల్లాకు రానున్నాయన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో నిరంతర నిఘాతోపాటు పోలీసు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో పాల్గొననున్న 12వేల మంది ప్రభుత్వ ఉద్యోగులకు మే 5వ తేదీ నుంచి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పిస్తున్నట్లు వివరించారు. 85 సంవత్సరాలు పైబడిన ఓటర్లు ఇంటివద్దనుంచే ఓటువేసే ప్రక్రియ కోసం బీఎల్వోల ద్వారా వివరాలు చేపడుతున్నట్లు చెప్పారు. సమావేశంలో డీఆర్వో పుల్లయ్య, జిల్లా టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్, సురేంద్రకుమార్, కోదండయాదవ్, రాహుల్ (టీడీపీ), పరదేశి (కాంగ్రెస్), ఉదయ్, ప్రతాప్ (వైసీపీ), గంగరాజు (సీపీఎం), అట్లూరి శ్రీనివాసులు (బీజేపీ) తదితరులు పాల్గొన్నారు.

అధికారులకు కనబడలేదా?


శిలాఫలకంపై సీఎం, మంత్రి, ఎమ్మెల్సీల ఫొటోలు

కుప్పం, ఏప్రిల్ 10: ఎన్నికల కోడ్ అమలు గురించి కుప్పంలో అధికారులు సరిగా పట్టించుకోవడంలేదు. ప్రతిపక్ష పార్టీల నుంచి ఫిర్యాదులు అందుతున్నా స్పందించడంలేదు. కుప్పం మండలంలోని చెక్కునత్తం పంచాయతీ కనమపచ్చార్లపల్లె గ్రామంలో జగనన్న కాలనీ పేరుతో వేసిన శిలాఫలకంపై సీఎం జగన్‌తోపాటు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీ భరత్‌ల ఫొటోలు ఉన్నాయి. వీటిని చెరిపే ప్రయత్నం చేయకుండా అధికారులు అలాగే వదిలేశారు. దీంతో అధికార పార్టీకి కుప్పం అధికారులు సహకరిస్తున్నారన్న విమర్శలు తీవ్ర స్థాయిలో వినిపిస్తున్నాయి.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.2.71 కోట్లు

తిరుమల, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.2.71 కోట్లు లభించింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ మంగళవారం లెక్కించి బుధవారం ఉదయం ప్రకటించింది. ఇక, మంగళవారం 55,756 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 17,866 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు.

2 నుంచి ఎస్వీయూలో ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 10: ఎస్వీ యూనివర్సిటీలో మే 2వ తేదీ నుంచి ప్రీ-పీహెచ్‌డీ పరీక్షలు నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన షెడ్యూల్‌ను పరీక్షల విభాగం విడుదల చేసింది. 2వ తేదీన రీసెర్చ్ మెథడాలజీ, 4న రీసెర్చ్ టాపిక్‌కు సంబంధించిన పరీక్షలు నిర్వహిస్తారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకూ ఈ పరీక్షలు జరుగుతాయని సీతా దామ్లానాయక్ వెల్లడించారు.

వారికో న్యాయం.. మాకో న్యాయమా?

ఎన్నికల ప్రచారానికి వైసీపీకి అనుమతిస్తే మాకూ ఇవ్వండి

ఎస్వీయూ వీసీకి జనసేన, టీడీపీ కూటమి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు వినతి


పోలీసులతో ఆరణి వాగ్వాదం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 10: ఎన్నికల ప్రచారంలో తమకో న్యాయం, వైసీపీ వారికి ఒక న్యాయమా? అని కూటమి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు ప్రశ్నించారు. ఎస్వీ యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీలో వైసీపీ ఎన్నికల ప్రచారం సాగుతుందనే సమాచారంతో జనసేన నేత పసుపులేటి హరిప్రసాద్‌తో కలిసి బుధవారం అక్కడికి చేరుకున్నారు. పోలీసులు, ఎన్నికల అధికారులు వారిని అడ్డుకున్నారు. యూనివర్సిటీలో ప్రచారానికి అనుమతి ఉండాలని సూచించినట్టు తెలుస్తోంది. వైసీపీ వారు ఎలాంటి అనుమతితో ప్రచారం నిర్వహిస్తున్నారనే విషయం చూడటానికే వచ్చామని, ప్రచారం చేపట్టడానికి రాలేదని స్పష్టం చేశారు. వైసీపీ నాయకులను అనుమతిస్తే, తమను కూడా అనుమతించాలని వీసీ శ్రీకాంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఆరణి శ్రీనివాసులు, పసుపులేటి హరిప్రసాద్‌ను ఇంజినీరింగ్ కాలేజీ వద్ద పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. వీసీకి వినతి పత్రం అందజేసి వెళ్లిపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

విచ్చలవిడిగా తాయిలాల తరలింపు...?


ఎమ్మెల్యే స్టిక్కర్‌తో నెంబర్ ప్లేట్ లేకుండా సంచరిస్తున్న కారు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 10: శ్రీకాళహస్తిలో ఓటర్లకు అందించేందుకు అధికార పార్టీ నాయకులు విచ్చలవిడిగా తాయిలాలు తరలిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వైసీపీ ముఖ్య నేత కుమార్తె ఆర్టీసీ బస్టాండ్‌కు ఆనుకొని అపార్ట్మెంట్లు ఉండే ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. ఆమె ఇంటి వద్ద నుంచి నెంబర్ ప్లేట్లు తొలగించిన కార్లు నియోజకవర్గం మొత్తం చక్కర్లు కొడుతున్నాయి. రాత్రి వేళల్లో ఆమె ఇంటి నుంచి బయలుదేరుతున్న కార్లు కానుకలతో గ్రామాలకు చేరుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. నెంబర్ ప్లేట్ లేని కారుపై ఎమ్మెల్యే అనే స్టిక్కర్ కూడా ఉండడం గమనార్హం. చీరలు, పలు రకాల కానుకలు ఉన్నట్లు సమాచారం.

కొలువు రెస్కోలో.. తరించేది బావ సేవలో

ఎమ్మెల్సీ భరత్ బావమరిది గిరిధర్ నిర్వాకం ● ఎన్నిల కోడ్‌ను ఉల్లంఘించి రాజన్న క్యాంటీన్ నిర్వహణ ● చర్యలు తీసుకోని అధికారులు


కుప్పంలో రాజన్న క్యాంటీన్ వద్ద అజమాయిషీ చేస్తున్న గిరిధర్ (ఫైల్ ఫొటో)

కుప్పం, ఏప్రిల్ 10: కుప్పం వైసీపీ అభ్యర్థి, ఎమ్మెల్సీ భరత్ బావమరిది రెస్కోలో కొలువు చేస్తూ.. తన బావ రాజకీయపరమైన పనులు చక్కబెడుతున్నారు. దీనిని అధికారులు చూసీ చూడనట్లు ఊరుకుంటున్నారు వైసీపీ నడుపుతున్న రాజన్న క్యాంటీన్ నిర్వహణ సర్వం తానై చేస్తున్నా కనీసం చర్యలు తీసుకోవడం లేదు. వివరాలిలా ఉన్నాయి. భరత్‌కు బావమరిది వరసయ్యే గిరిధర్ అనే వ్యక్తి మూడేళ్లుగా రెస్కో (కుప్పం గ్రామీణ విద్యుత్తు సహకార సంస్థ)లోని కంప్యూటర్ సెక్షన్‌లో ఉద్యోగం చేస్తున్నారు. ఉద్యోగంలో చేరిన మొదట్లో తప్ప ఆయన ఏనాడూ కార్యాలయంలో బాధ్యతలు సక్రమంగా నిర్వహించే వారు కాదని రెస్కో ఉద్యోగులే చెబుతున్నారు. మరీ ఎన్నికలు సమీపించిన ఈ తరుణంలో పూర్తిగా కార్యాలయం ఉద్యోగ బాధ్యతలు వదిలిపెట్టి బావ అయిన భరత్ తరఫున వైసీపీ ప్రచారంలో పడ్డారన్న ఆరోపణలు ఉన్నాయి. స్వయంగా ఎమ్మెల్సీకి బావమరిది కావడంతో గిరిధర్ విధులకు సరిగా హాజరు కాకపోయినా, ఆయన వేతనం మాత్రం ఠంచనుగా అకౌంట్లో పడిపోతోంది. ఒకవేళ ఉద్యోగం చేసి తీరాలన్న రూల్‌ను సాధారణ ఉద్యోగుల్లాగా ఆయనకు కూడా విధిస్తే తమ ఉద్యోగాలకు ఎక్కడ ఎసరు వస్తుందోనని అధికారులు భయపడుతూ వచ్చారు. ఇలా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న రెస్కో ఉద్యోగి గిరిధర్, వైసీపీ తరఫున కుప్పం ఎమ్మార్‌రెడ్డి సర్కిల్‌లో నడుస్తున్న రాజన్న క్యాంటీన్ నిర్వహణ బాధ్యతలు కూడా అదనంగా, అనధికారికంగా చూసుకుంటున్నారు. రాజన్న క్యాంటీన్ వద్ద నిలబడి గిరిధర్ అజమాయిషీ చేస్తున్న ఫొటోలు రెండు రోజులుగా సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. దీంతో రెస్కోలో కొలువు చేస్తూ, పార్టీ కార్యక్రమాల్లో లీనమవుతున్నారన్న ఆయనపైన ఉన్న ఆరోపణలు వాస్తవమయ్యాయి. ఇంత జరుగుతున్నా అటు రెస్కో అధికారులు కానీ, ఇటు ఎన్నికల అధికారులు కానీ అతడి మీద ఇంతదాకా చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై రెస్కో ఎండీ ప్రభాకర్‌ను వివరణ కోరగా.. రాజన్న క్యాంటీన్ నిర్వహణ బాధ్యతలు చూస్తున్న ఫొటోలు తమకూ వచ్చాయని, దీనిపై వివరణ ఇవ్వాల్సిందిగా గిరిధర్‌కు నోటీసులు ఇస్తామని తెలిపారు. దీనిపై మున్సిపల్ ఎన్నికల అధికారి అయిన మున్సిపల్ కమిషనర్‌కు కూడా నివేదిక సమర్పిస్తామని స్పష్టం చేశారు.

కారును ఢీకొట్టి ... ఆపై ఘర్షణ

కారు దహనం


దహనమైన కారు

కుప్పం, ఏప్రిల్ 10: గుడుపల్లె మండల పరిధిలో బుధవారం యువకుల మధ్య చోటు చేసుకున్న ఘర్షణ కారు దహనానికి దారితీసింది. మద్యం మత్తులో యువకులు విచక్షణా రహితంగా దాడికి తెగబడ్డారు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు ... శాంతిపురం మండలం సోమాపురం గ్రామానికి చెందిన ఎ.చిరంజీవి కుమారుడు గుడుపల్లె మండలం వేపమానుకొత్తూరులో గల తన సోదరి సుమలత ఇంటికి బుధవారం కారులో వచ్చాడు. ఆమె ఇంట్లో భోజనం చేసుకుని తన కుమారుడితోపాటు కారులో స్వగ్రామానికి వెళ్లడానికి కారును రోడ్డుమీదకు తీసుకొచ్చి రివర్స్ చేస్తున్నాడు. అదే సమయంలో గుడుపల్లె మండలం పెద్దబజనవాడ గ్రామానికి చెందిన ప్రవీణ్‌కుమార్ తన స్నేహితుడితోపాటు ద్విచక్ర వాహనంపై కుప్పంవైపు వెళ్తూ రివర్స్ చేస్తున్న కారును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ప్రవీణ్‌కుమార్ నుదుటికి రక్తగాయమైంది. అతడు వెంటనే తన గ్రామస్తులు అంజి, రాజేంద్ర, సింగారవేలు, జంగాలపల్లెతో పాటు ఇంకా 15 మంది దాకా స్నేహితులను ఫోన్ చేసి పిలిపించాడు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న యువకులు చిరంజీవితో గొడవకు దిగారు. యువకులు మద్యం మత్తులో ఉండడంతో అతడు భయపడి వారి నుంచి తప్పించుకుని అదే గ్రామంలోని తన సోదరి ఇంటికి వెళ్లిపోయాడు. ఆ తర్వాత ఆగ్రహం పట్టలేని యువకులు సహనం కోల్పోయి చిరంజీవికి చెందిన కారుపై రాళ్లు, రాడ్లతో దాడి చేశారు. రోడ్డుపక్కన ఉన్న చిల్లరకొట్టులో పెట్రోల్ తెచ్చి నిప్పు అంటించడంతో కారు పూర్తిగా దహనం అయింది. ఈ ఘర్షణపై గుడుపల్లె పోలీసులు ఇరు వర్గాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పదవీ కాలం ముగిసి 18 నెలలైనా జీతం!

● కాణిపాక ఆలయంలో వింత

ఐరాల(కాణిపాకం), ఏప్రిల్ 10: కాణిపాక ఆలయంలో ఓ ఉద్యోగి పదవీ కాలం ముగిసినా అధికారులు జీతం అందించారు. ఆలయంలో వెంకటరత్నం అనే వ్యక్తి భజంత్రీగా పని చేస్తున్నారు. ఆయన పదవీ కాలం 18 నెలల క్రితం ముగిసింది. ఆలయ ఉద్యోగులు ఈ విషయాన్ని తెలుసుకోకుండా అతడికి పూర్తి జీతాన్ని లక్షలాది రూపాయలను అందించారు. ఇటీవల ఎస్ఆర్‌ను గమనించిన ఆలయ అధికారులు ఖంగుతిన్నారు. ఇక, వరసిద్ధుడి ఆలయంలో ఎలాంటి నోటిఫికేషన్ లేకుండా ఏకంగా 20 మందికి ఉద్యోగావకాశాలు కల్పించినట్లు సమాచారం. ఈ విషయంపై దేవదాయ శాఖ ఉన్నతాధికారులకు కోర్టు నోటీసులు అందించినట్లు తెలిసింది. ఆలయ ఉద్యోగులు రోజు వారీ కార్యక్రమాలను మాత్రం పట్టించుకుని మిగిలిన విషయాలను ఏమాత్రం పట్టించుకోక పోవడం సమంజసం కాదని భక్తులు అంటున్నారు. దీనిపై వివరణ తీసుకోవడానికి ఈవోను ఫోన్‌లో ప్రయత్నించగా, ఆయన అందుబాటులోకి రాకపోవడం గమనార్హం.

వేసవి నుంచి ఉపశమనం పొందేలా..



వేసవితాపం నుంచి శ్రీవారి గజరాజులు(ఏనుగులు) ఉపశమనం పొందుతున్నాయి. శ్రీవేంకటేశ్వరస్వామి ఉత్సవాలు, ఊరేగింపుల్లో నిత్యం రెండు గజరాజులు పాల్గొంటూ ఉంటాయి. 20 రోజులుగా తిరుమలలో ఎండతీవ్రత పెరగడంతో భక్తులతో పాటు గజరాజులు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతున్నాయి. ఈ క్రమంలో ఏనుగుల కోసం మావటీలు ఉదయం నుంచి సాయంత్రం వరకు గోశాలలో నీటిని అందుబాటులో ఉంచుతున్నారు. కాస్త ఉక్కగా అనిపిస్తే నీటిలో దిగి గజరాజులు జలకాలాడుతున్నాయి. - తిరుమల, ఆంధ్రజ్యోతి

సీజ్ చేసిన రూ.26.07లక్షల నగదు అప్పగింత

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 10: తిరుపతి జిల్లాలో 17 కేసుల్లో 35,06,559 నగదు సీజ్ చేయగా వాటిలో 13 కేసుల్లో ఆధారాలు సమర్పించడంతో రూ.26,07,550 లక్షలను గ్రీవెన్స్ త్రిసభ్య కమిటీ ద్వారా సంబంధిత వ్యక్తులకు అందజేసినట్లు కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. అలాగే సి-విజిల్ యాప్ ద్వారా మొత్తం 538ఫిర్యాదులు అందగా 410 పరిష్కరించినట్లు వెల్లడించారు.

వెంకన్న సేవలో శ్రీలంక మంత్రి



తిరుమల, ఆంధ్రజ్యోతి : తిరుమల శ్రీవారిని బుధవారం ఉదయం దర్శించుకుని వస్తున్న శ్రీలంక మంత్రి మహింద అమరవీర. ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

హమ్మయ్య ఎండ తగ్గింది..!


చిత్తూరులోని పీసీఆర్ సర్కిల్‌లో బోసిపోయిన రోడ్డు

● అత్యధికంగా పులిచెర్లలో 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 10: జిల్లాలో బుధవారం సూర్యుడి ప్రతాపం తగ్గడంతో ప్రజలు కాస్త ఉపశమనం పొందారు. గతవారం వరకు జిల్లాలోని అన్ని మండలాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలతో తీవ్ర ఇబ్బందులు పడ్డ ప్రజలకు మంగళ, బుధవారాల్లో ఎండలు తగ్గుముఖం పట్టడంతో కొంత సేదతీరారు. జిల్లాలో అత్యధికంగా పులిచెర్లలో 39.0, అత్యల్పంగా బైరెడ్డిపల్లిలో 34.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మండలాల వారీగా.. పుంగనూరులో 38.9, గుడుపల్లెలో 38.9, తవణంపల్లెలో 38.8, నింద్రలో 38.7, విజయపురంలో 38.3, నగరిలో 38.3, శాంతిపురంలో 37.9, గుడిపాలలో 37.9, సోమలలో 37.8, సదుంలో 37.7, శ్రీరంగరాజపురంలో 37.5, పాలసముద్రంలో 37.3, పెద్దపంజాణిలో 37.0, చౌడేపల్లెలో 36.9, రొంపిచెర్లలో 36.9, యాదమరిలో 36.9, చిత్తూరులో 36.8, గంగాధరనెల్లూరులో 36.8, బంగారుపాళ్యంలో 36.5, కార్వేటినగరంలో 36.5, కుప్పంలో 36.5, వెదురుకుప్పంలో 35.5, వి.కోటలో 35.5, పలమనేరులో 35.3, పెనుమూరులో 35.3, పూతలపట్టులో 35.2, రామకుప్పంలో 35.1, ఐరాలలో 34.8, గంగవరంలో 34.6 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

పునాదులకే పరిమితమైన జగనన్న కాలనీ ఇళ్లు


శ్రీకావేరిరాజుపురం పంచాయతీలో పునాదులకే పరిమితమైన జగనన్న కాలనీ ఇళ్లు

పాలసముద్రం, ఏప్రిల్ 10: మండలంలోని శ్రీకావేరిరాజుపురం పంచాయతీలో 20 మంది బీసీ లబ్ధిదారులకు గ్రామానికి దూరంగా సింహరాజుపురానికి వెళ్లే గుట్టమీద ఇంటి స్థలాలను కేటాయించారు. ఇందులో ఏడుగురు లబ్ధిదారులు పునాదుల వరకు వేసి ఆపేశారు. మిగిలిన 13 మంది పునాదులను సైతం వేసుకోలేదు. గ్రామానికి దూరంగా అటవీ ప్రాంతంలో ఇంటి స్థలాలు కేటాయించడంతో ఇళ్ల నిర్మాణం చేపట్టడానికి ముందుకు రాలేదు. ఇళ్ల నిర్మాణం చేపట్టిన ప్రాంతంలో లబ్ధిదారుల సౌకర్యార్థం నీటి వసతి కల్పించడానికి రెండు సింటెక్స్ ట్యాంకులను సైతం ఏర్పాటు చేసి, కొళాయి కనెక్షన్లు ఇచ్చారు. స్తంభాలు నాటి విద్యుత్ సౌకర్యం కూడా కల్పించారు. గ్రామానికి రెండు కి.మీ. దూరంలో లబ్ధిదారులకు ఇంటి స్థలాలు కేటాయించడంతో వారు ఇళ్ల నిర్మాణం చేయడానికి ముందుకు రాలేదు. ఏడుగురు లబ్ధిదారుల చేత మాత్రం హౌసింగ్ అధికారులు పునాదుల వరకు వేయించారు. ఇళ్ల నిర్మాణం పూర్తి చేయడానికి లబ్ధిదారులు ముందుకు రాకపోవడంతో అధికారులు సైతం మిన్నకుండిపోయారు. లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణం కోసం వేసిన పైపులైన్లు, కొళాయిలు, వాటర్ ట్యాంకులు వృథాగా ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకుని లబ్ధిదారులతో ఇళ్ల నిర్మాణం పూర్తిచేయించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ముగ్గురు ఎస్వీయూ ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు

● వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొనడమే కారణం

తిరుపతి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీలో ముగ్గురు ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు పడింది. కొన్ని రోజుల క్రితం వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొనడంతో కేంద్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు అందినట్టు సమాచారం. దీంతో చర్యల కోసం ఎన్నికల కమిషన్ యూనివర్సిటీ అధికారులను ఆదేశించిన క్రమంలో అయ్యప్ప (డ్రైవర్), డాక్టర్ ఐఎస్ కిషోర్ మాథ్యూ అర్నాల్డ్ (అకడమిక్ కన్సల్టెంట్), మురళిరెడ్డి (రిజిస్ట్రార్ పీఎస్) లను సస్పెండ్ చేసినట్టు సమాచారం.ఈ ముగ్గురినీ విధుల నుంచీ తొలగిస్తూ వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ హుస్సేన్ బుధవారం ఉత్తర్వులు వెలువరించినట్టు సమాచారం.

ఆ అక్రమ నియామకాలను రద్దు చేయాల్సిందే?

● ఎస్వీయూ వీసీకి కమిషనర్ సూచన

తిరుపతి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ ముందు పెట్టుకుని శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో జరిగిన నాన్ టీచింగ్ సిబ్బంది నియామకాలపై ఎన్నికల సంఘం సీరియస్ అయ్యింది.ఆ అక్రమ నియామకాలను రద్దు చేయాల్సిందేనని విచారణాధికారిగా ఉన్న తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, మున్సిపల్ కమిషనర్ అదితిసింగ్ సూచించినట్టు తెలుస్తోంది. బుధవారం మున్సిపల్ కార్యాలయానికి వీసీ శ్రీకాంత్ రెడ్డి మరోసారి విచారణకు హాజరయ్యారు. ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత విధుల్లో చేరిన 12 మంది నాన్ టీచింగ్ సిబ్బంది రాజకీయ ఒత్తిళ్లతోనే నియమించినట్లు విచారణలో వెల్లడైనట్టు సమాచారం. దీంతో వారిని తొలగించాలని ఎన్నికల అధికారులు వీసీకి సూచించినట్టు తెలుస్తోంది.

ఎస్వీ వైద్య కళాశాల మార్చురీకి విద్యుత్తు అంతరాయం

● గంటల తరబడి సరఫరా లేకపోవడంతో దుర్వాసన


దుర్వాసన భరించలేక మార్చురీ ముందు ముక్కు మూసుకుని కూర్చొన్న మహిళ - మార్చురీ ముందు ముక్కుకు రుమాలు కట్టుకొని నిల్చున్న వ్యక్తి

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 10 : ఎస్వీ వైద్య కళాశాల, దాని అనుబంధ మార్చురీకి బుధవారం నాలుగు గంటలకు పైగా విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. తద్వారా మృతదేహాల నుంచి దుర్వాసన రావడంతో చుట్టుపక్కల వారు ముక్కులు మూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. రుయాస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయిన, రోడ్డు ప్రమాదాల్లో మరణించిన, గుర్తు తెలియని మృతదేహాలను ఎస్వీ వైద్య కళాశాల మార్చురీలోని ఫ్రీజర్‌లో భద్రపరుస్తారు. మంగళవారం సెలవు కావడంతో ఆ రోజు మృతిచెందిన వారి దేహాలను కూడా పోస్టుమార్టం చేసేందుకు మార్చురీలో భద్రపరిచారు. బుధవారం ఉదయం 7 గంటల సమయంలో విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. 11 గంటల వరకు రాలేదు. ఆ సమయంలో మార్చురీలో తొమ్మిది మృతదేహాలు ఉన్నాయి. వీటిల్లో నాలుగు గుర్తు తెలియని మృతదేహాలు కావడంతో పది రోజులకు భద్రపరిచి ఉన్నారు. నాలుగు గంటలకు పైగా విద్యుత్తు సరఫరా లేకపోవడంతో మృతదేహాలు డీకంపోజ్ అయ్యి దుర్వాసన వెదజల్లాయి. దీంతో ఈ మార్గాన వెళ్లే వారు, పక్కనే ఆర్థో వార్డుకు వచ్చే రోగులు దుర్వాసన భరించలేక ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఎస్వీ వైద్య కళాశాలలో కూడా విద్యుత్తు సరఫరా లేక విద్యార్థులు, సిబ్బంది చీకట్లో ఇబ్బందులు పడ్డారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని ఈ పరిస్థితి పునరావృతం కాకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఒకప్పటి.. ప్రశాంత పుంగనూరే లక్ష్యం





'ఒకప్పుడు పుంగనూరు నియోజకవర్గం ప్రశాంతంగా ఉండేది. అభివృద్ధి పథంలో పయనించేది. ఎప్పుడైతే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన కుటుంబం ఇక్కడ అడుగుపెట్టిందో.. అప్పట్నుంచి అరాచకాలు, అక్రమాలు, రౌడీయిజం, దోపిడీలు పెరిగాయి. ప్రశ్నిస్తే ఆయనకు ఊడిగం చేసే పోలీసు అధికారుల ద్వారా అమాయకులు, బాధితులు, ప్రతిపక్షాలపై తప్పుడు కేసులు పెట్టి జైళ్లకు పంపుతున్నారు. బెదిరింపులకు దిగుతున్నారు. ఇక, వారి దృష్టిలో అభివృద్ధి అంటే.. పెద్దిరెడ్డి కుటుంబానికి కాంట్రాక్టులు రావడం.. అమాయక జనాన్ని, రైతులను అన్యాయం చేయడం. ఇలాంటి పెద్దిరెడ్డి అరాచకాలకు అంతం పలికి ఒకప్పటి ప్రశాంత పుంగనూరును నెలకొల్పడమే నా లక్ష్యం' అని చెబుతున్నారు చల్లా రామచంద్రారెడ్డి (చల్లా బాబు). ఈయన తాత సీకే నారాయణరెడ్డి (సీపీఐ), తండ్రి చల్లా ప్రభాకర్‌రెడ్డి (టీడీపీ).. ఇద్దరూ పీలేరు ఎమ్మెల్యేలు. ఇప్పుడు చల్లా కుటుంబం నుంచి మూడో తరం నేతగా టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా ఆయన పుంగనూరులో పోటీ చేస్తున్నారు. నియోజకవర్గంలో అధికారపార్టీ అరాచకాలు, సమస్యలు, అభివృద్ధిపై తన ఆలోచనలను 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో పంచుకున్నారు.

\- పుంగనూరు

● పెద్దిరెడ్డి వచ్చాక అరాచకాలకు కేరాఫ్‌గా మార్చేశారు ● టీడీపీ అభ్యర్థి రామచంద్రారెడ్డి

● 'చల్లా' కుటుంబం నుంచి మూడో తరం నేతగా మరోసారి బరిలోకి..

● ఇంటర్వ్యూ

1983 నుంచీ టీడీపీలోనే చల్లా కుటుంబం

1983లో ఎన్టీరామారావు పార్టీ స్థాపించినప్పటి నుంచి ఎన్ని ఆటుపోట్లు వచ్చినా మా కుటుంబం టీడీపీలోనే కొనసాగుతోంది. పార్టీలు మారకుండా ప్రజల సమస్యలపై పోరాడుతోంది. గతంలో రొంపిచెర్ల మండలం పీలేరు నియోజకవర్గంలో ఉండగా, 1962లో మా తాత సీకే నారాయణరెడ్డి సీపీఐ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు చదువుకుని ప్రయోజకులు కావాలని సొంతంగా హాస్టళ్లు స్థాపించి తర్వాత ప్రభుత్వానికి అప్పగించారు. మా నాన్న చల్లా ప్రభాకర్‌రెడ్డి 1983, 1985లో రెండు పర్యాయాలు టీడీపీ నుంచి పీలేరు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. మా తండ్రి మరణంతో 1989లో నేను తొలిసారి పీలేరు టీడీపీ అభ్యర్థిగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై పోటీ చేసి ఓటమిచెందా. ఇంతకాలానికి టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు నన్ను గుర్తించి పుంగనూరు అభ్యర్థిగా పోటీ చేయడానికి అవకాశం ఇచ్చినందుకు ప్రత్యేక ధన్యవాదాలు. ఈ ఎన్నికల్లో ప్రజలు టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ప్రభుత్వం రావాలని ఆశగా ఎదురు చూస్తున్నారు. నన్ను ఎమ్మెల్యేగా గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారు.

పరిశ్రమల పేరిట ఎన్నికల స్టంట్

రాష్ట్రంలో సీఎం జగన్ తర్వాత ప్రభుత్వంలో ప్రాధాన్యత, గుర్తింపు ఉన్న మంత్రి పెద్దిరెడ్డి. ఈయన పుంగనూరులో పరిశ్రమలు స్థాపన అంటూ ఎన్నికల స్టంట్ చేశారు. అబద్ధాలతో, ఉత్తుత్తి మాటలతో హడావుడి చేయడం తప్ప ఒక్క పరిశ్రమనూ ఏర్పాటు చేయలేదు. పుంగనూరు మండలంలో మూడుచోట్ల పరిశ్రమల ఏర్పాటు అంటూ శంకుస్థాపనలు చేయడం, ఉత్తుత్తి మాటలు చెప్పడం తప్ప మరొకటికాదు. ప్రజలు, యువత, నిరుద్యోగులను పరిశ్రమలు అంటూ పెద్దిరెడ్డి మోసం చేశారు. ఎన్నో పరిశ్రమలు పెట్టి వీరు అభివృద్ధి చేసి ఉండొచ్చు. వీరికి ఎవరూ అడ్డురాలేదు. అయినా, వీరికి పుంగనూరు అభివృద్ధి పట్టలేదు. పుంగనూరులో గెలిచిన ఏడాదిలో మేము మూడు పరిశ్రమలు ఏర్పాటు చేసి తీరుతాం. విద్య, వైద్యరంగం అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటా.

ప్రాజెక్టులకు టీడీపీ వ్యతిరేకం కాదు

పుంగనూరు నియోజకవర్గంలో నిర్మిస్తున్న ప్రాజెక్టులకు తెలుగుదేశం పార్టీ వ్యతిరేకం కాదు. సోమల మండలం ఆవులపల్లె వద్ద ప్రభుత్వ భూములున్నా టీడీపీ వర్గీయులను దెబ్బతీయడానికి పచ్చటి పొలాలు, గ్రామాలు ముంపునకు గురయ్యేలా పెద్దిరెడ్డి ప్రాజెక్టులు నిర్మించారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలను తుంగలోతొక్కి పెద్దిరెడ్డి కంపెనీ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రాజెక్టులు నిర్మించడంతో ఎన్జీటీ రూ.100 కోట్ల జరిమానా విధించింది. నేతిగుట్లపల్లె ప్రాజెక్టు ముంపుభూములకు సంబంధించి రైతులకు నష్టపరిహారం ఇవ్వకుండా 90 శాతం పనులను మంత్రి కంపెనీ పూర్తిచేసి రైతుల కడుపు కొట్టారు. ప్రభుత్వానికి ఖర్చు తగ్గి, ప్రజలు ఇబ్బందులు పడకుండా రైతులకు మేలు జరిగేలా ప్రాజెక్టుల నిర్మాణం చేపడితే ఎవరూ వ్యతిరేకించరు.

పుంగనూరుకు మంచి రోజులు వస్తాయి

ఎన్నికలు అయిపోగానే సీఎంగా చంద్రబాబునాయుడు వస్తారు. పుంగనూరును అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం. పూర్వపు పుంగనూరులా ప్రశాంతత నెలకొల్పుతాం. ఇక్కడి సమస్యలను చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల ద్వారా చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం చేస్తాం. ఇప్పటికే నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో సమస్యలు గుర్తించా. ప్రధానంగా రైతు సమస్యలు అధికంగా ఉన్నాయి. నీటి సమస్య తీవ్రంగా ఉంది. యువతకు ఉపాధిలేక బయట రాష్ట్రాలకు వలసలు వెళుతున్నారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించడానికి చంద్రబాబు నాయుడు, మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డితో సంప్రదించి ప్రధానమంత్రి నరేంద్రమోదీ ద్వారా పరిశ్రమలు తీసుకురావడానికి ప్రత్యేక కృషి చేస్తా. ఇక, గార్మెంట్ కంపెనీలు నెలకొల్పి మహిళలకు ఉపాధి కల్పిస్తా. బెంగళూరుకు సమీపంలో పుంగనూరు ఉండటంతో అనేక కంపెనీలు, ఫ్యాక్టరీలు ఏర్పాటుకు కృషి చేస్తా. పుంగనూరులో చింతపండుకు గిట్టుబాటు ధర కల్పించి ప్రోత్సహిస్తాం. రాష్ట్ర భవిష్యత్‌కోసం ఈ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ బీజేపీతో పొత్తు పెట్టుకుంది.

హంద్రీ నీవా ద్వారా అన్ని చెరువులకు నీరిస్తాం

హంద్రీనీవా నీటిని గత ప్రభుత్వంలో చంద్రబాబునాయుడు పుంగనూరు, పలమనేరు వరకు తీసుకెళ్లి చెరువులకు నీరు నింపారు. పుంగనూరు చెరువుకు కూడా గతంలో నీళ్లు ఇచ్చిన సంగతి ప్రజలకు తెలుసు. హంద్రీనీవా కాల్వల లైనింగ్‌లు దెబ్బతినగా వాటిని రిపేరు చేయకుండా కేవలం కుప్పానికి నీరు తీసుకెళ్లాలని సీఎం జగన్ ప్రయత్నించి అభాసుపాలయ్యారు. పూడిన కాల్వ లైనింగ్ పనులు పూర్తిచేసి నీటిని చెరువులకు మళ్లిస్తాం.

సమ్మర్‌స్టోరేజీ ట్యాంకు నీటిని ప్రజలకు అందిస్తాం

మంత్రి పెద్దిరెడ్డికి కాంట్రాక్టు పనులపై ఉన్న శ్రద్ధ ప్రజల సమస్యలు తీర్చడానికి లేదు. రూ.33 కోట్ల నుంచి దాదాపు రూ.50 కోట్ల వరకు ఖర్చుచేసి నిర్మించిన పుంగనూరు సమ్మర్ స్టోరేజీ ట్యాంకు సంవత్సరాలుగా నిరుపయోగంగా ఉండే తప్ప ప్రజలకు తాగడానికి చుక్కనీరు ఇవ్వలేదు. టీడీపీ ప్రభుత్వం రాగానే సమ్మర్‌స్టోరేజీ ట్యాంకు నీటిని పట్టణ ప్రజలకు సరఫరా చేస్తాం. నియోజకవర్గంలో ఎక్కడ చూసినా స్వలాభం కోసం మంత్రి పెద్దిరెడ్డి కంపెనీ కాంట్రాక్టు పనులు, ఇసుక, మద్యం, క్వారీలు, మట్టి మాఫియాతో కోట్ల రూపాయల అవినీతి, అక్రమాలు పాల్పడ్డారు.

అన్యాయంగా జైళ్లలో మగ్గినాం

ప్రశాంతమైన పుంగనూరును మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అధికారబలంతో, ప్రతిపక్షాలను అణగదొక్కుతూ తప్పుడు కేసులతో భయపెడుతూ పోలీసురాజ్యంగా మార్చారు. కొంతమంది పోలీసు అధికారులు పెద్దిరెడ్డి తొత్తులుగా ఉంటూ ఆయన ఏమి చెబితే అది చేస్తున్నారు. ప్రతిపక్షాలు బలపడకుండా అక్రమకేసులు, రౌడీషీట్లు తెరవడం, అరెస్టులు చేయడం, బాధితులపైనే అన్యాయంగా కేసులు పెట్టి, పోలీసులచే కొట్టించి వేధిస్తున్నారు. పుంగనూరులో నాతో పాటు టీడీపీ కార్యకర్తలు, నాయకులపై దాదాపు 800 అక్రమ కేసులు ఉన్నాయి. అన్యాయంగా నెలకుపైగా జైళ్లలో మగ్గినాం. వైసీపీ ఆరాచకాలు మితిమీరిపోవడంతో పుంగనూరు ప్రజలు విజ్ఞతతో ఆలోచిస్తున్నారు. ఎంతో మంది ముస్లిం మైనార్టీలపై తప్పుడుకేసులు పెట్టి అన్యాయంగా జైళ్లకు పంపారు. దౌర్జన్యకాండను అరికట్టడానికి పుంగనూరు ఎమ్మెల్యేగా పోటీచేసే పాపాల పెద్దిరెడ్డిని, రాజంపేట ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆయన కుమారుడు మిథున్‌రెడ్డిని ఎన్నికల్లో ఓడించడానికి ప్రజలు ఇప్పటికే నిర్ణయం తీసుకున్నారు.

ప్రజలు టీడీపీవైపే ఉన్నారు

పుంగనూరులో సుపరిపాలన, అభివృద్ధి జరిగి అరాచకాలు నశించిపోవాలని ప్రజలు తెలుగుదేశం పార్టీ వైపే ఉన్నారు. వైసీపీ పాలనలో వ్యవస్థలన్నీ నాశనమయ్యాయి. అప్పులు పెరిగినా అభివృద్ధి శూన్యం. చంద్రబాబు పాలనపై ప్రజలకు నమ్మకం ఉంది. బీజేపీ కేంద్ర ప్రభుత్వం వల్ల రాష్ట్రం అభివృద్ధి జరుగుతుంది. పెద్దిరెడ్డి కుటుంబం చేసిన అవినీతి, అక్రమాలను ప్రజల ముందుకు తీసుకెళుతా. సమస్యలపై పోరాటం చేస్తుండగా టీడీపీకి ప్రజలు సంపూర్ణ మద్దతు ఇస్తుండటంతో విజయం తథ్యం.

బీజేపీ ఎంపీ అభ్యర్థిగా కిరణ్ రావడం శుభపరిణామం

రాజంపేట లోక్‌సభ బీజేపీ అభ్యర్థిగా మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి పోటీ చేయడంతో నియోజకవర్గం అభివృద్ధి చెందడం ఖాయం. మంత్రి పెద్దిరెడ్డి కుటుంబం దౌర్జన్యాలను అరికట్టడానికి కిరణ్‌కుమార్‌రెడ్డి రావడం శుభపరిణామం. టీడీపీ, జనసేన, బీజేపీలను సమన్వయం చేసుకుంటూ ప్రత్యర్థుల దాడులను తిప్పికొట్టి ఎన్నికల్లో పుంగనూరు అసెంబ్లీలో టీడీపీ, రాజంపేట లోక్‌సభ స్థానంలో బీజేపీ గెలుపు సాధిస్తాం.

పెద్దిరెడ్డి దోపిడీ, అరాచకాలను ప్రజలకు వివరిస్తాం

పుంగనూరు నియోజకవర్గంలో కాంట్రాక్టుల కోసం భూములిచ్చిన రైతులకు పరిహారం ఇవ్వకుండానే వృథా ప్రాజెక్టులను నిర్మించి నిధులు స్వాహా చేసిన వ్యక్తి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి. ఇక, పెద్దిరెడ్డి కుటుంబానికి చెందిన సదుం శివశక్తి పాల డెయిరీ రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వకుండా మోసం చేసింది. వీరు లీటరు పాల ధర రూ.18 ఇస్తుండగా గిట్టుబాటు కాక, అప్పులు భరించలేక రైతులు పాడి ఆవులను అమ్మి వలసలు వెళ్లారు. బయట పాల డెయిరీలను రాకుండా అడ్డుకోవడం, వీరు ఇచ్చింది తీసుకోకపోతే దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. మేము పాల రైతులకు లీటరుకు రూ.40 గిట్టుబాటు ధర ఇప్పిస్తాం. ఇక, మామిడి రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వకుండా మంత్రి అన్యాయం చేశారు. పాలు, మామిడి రైతుల రక్తం తాగిన పెద్దిరెడ్డి ఆగడాలు, దౌర్జన్యాలు, అరాచకాలను ప్రజలకు వివరిస్తాం.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

పులిచెర్లలో 132 మంది వలంటీర్ల రాజీనామా

కల్లూరు,ఏప్రిల్10: పులిచెర్ల మండలంలో 132మంది వలంటీర్లు బుధవారం మూకుమ్మడి రాజీనామా చేసినట్లు ఎంపీడీఓ సురేష్‌బాబు తెలి పారు. వలంటీర్లు రాజీనామా పత్రాలను కార్యదర్శులకు సమర్పించారని తెలిపారు.

ఘనంగా గంగజాతర



చౌడేపల్లె, ఏప్రిల్10: మండలంలోని ఎర్రగానిపల్లె, మేకలచిన్నేపల్లె, ముదిరెడ్డిపల్లెల్లో గంగ జాతర సందర్భంగా బుధవారం గ్రామదేవతలకు దివ్వెలు, దీపాలు, బోనాలు సమర్పించారు. ఎర్రగానిపల్లెలో బోయకొండ గంగమ్మ ఉత్సవ మూర్తిని ఊరేగించారు. అనంతరం అమ్మవార్లకు జంతు బలులు సమర్పించారు.

'బలవంతంగా వైసీపీ కండువాలు కప్పారు'

గంగవరం,ఏప్రిల్10: బలవంతంగా మాకు కండువాలు కప్పి వైసీపీలో చేర్చుకున్నారని గంగవరం మండలం జంగాలపల్లెకు చెందిన పలువురు నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. మాట్లాడదాం రండి అని పిలిచి బలవంతంగా వైసీపీ కండువాలు కప్పి అనవసరంగా రంగు పూశారని ఆరోపిస్తూ బుధవారం గంగవరం టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో జంగాలపల్లెకు చెందిన రవి, ఈశ్వర్ తమ అనుచరులతో కలసి టీడీపీ చేరారు. టీడీపీ మండల అధ్యక్షుడు సోమశేఖర్‌గౌడ్, ఆలకుప్పం రాజన్న, బాలాజీ తదితరులు వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

చౌడగానిపల్లెలో గడ్డివామి దగ్ధం

చౌడేపల్లె, ఏప్రిల్10: చౌడగానిపల్లెలో రత్నమ్మ తన పొలం వద్ద వరిగడ్డి వామి ఏర్పాటు చేసింది. అలాగే టమోటా సాగు కోసం కట్టెలను కూడా గడ్డి వామి సమీపంలో ఉంచింది. బుధవారం మధ్యాహ్నం గడ్డివామిలో మంటలు చెలరేగటంతో గ్రామస్తులు అగ్నిమాపకశాఖ అధికారులకు సమాచారమిచ్చారు. వెంటనే ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను చుట్టు పక్కల పొలాలకు వ్యాప్తి చెందకుండా అదుపు చేశారు. ఈ ప్రమాదంలో గడ్డివామి, టమోటా కట్టెలు దగ్ధమవటంతో సుమారు రూ.50వేలు ఆస్తినష్టం వాటిల్లింది.

వైభవంగా దోపోత్సవం



గుడుపల్లె, ఏప్రిల్ 10: అగ్ని మారెమ్మ బుధవారం దోపో వాహనం విహరించి భక్తులకు కనువిందు చేశారు. గుండ్లసాగరంలోని అగ్ని మారెమ్మ దేవాలయం వార్షిక ఉత్సవాల్లో భాగంగా ఉదయం వేదపండితులు ప్రత్యేక అభిషేకాలు, విశేషపూజలు చేసి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. రాత్రి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పట్టువస్త్రాలు, ఆభరణాలు, వివిధ రకాల పుష్పాలతో అలంకరించి దోపో వాహనంపై అధిష్ఠింపజేశారు. మంగళవాయిద్యాలు, కోలాటాల నడుమ దోపో వాహనాన్ని గ్రామ వీధుల్లో ఊరేగించారు. మహిళలు అమ్మవారికి కొబ్బరికాయలు కొట్టి, కర్పూర హారతులు ఇచ్చారు.

బాలిక ఆత్మహత్య కేసులో నిందితుడి అరెస్ట్

పుంగనూరు రూరల్, ఏప్రిల్10: బాలిక ఆత్మహత్య కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు అర్బన్ సీఐ రాఘవరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 7వ తేదీ పుంగనూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక (17)ను అదే గ్రామానికి చెందిన గణేశ్ అత్యాచార యత్నానికి ప్రయత్నించగా బాలిక కేకలు వేయడంతో అతడు పరారీ అయ్యాడు. దీంతో బాలిక మనస్థాపానికి గురై ఉరివేసుకుని మృతి చెందినట్లు ఆయన వివరించారు. దీంతో అతడిపై పోక్సోతో పాటు వివిధ నేరాల కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

పుంగనూరులో తెలుగుదేశం పార్టీ విజయం తథ్యం

వైసీపీ కార్యకర్తలు భారీస్థాయిలో టీడీపీలో చేరిక ● ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి





ఎన్నికల ప్రచారంలో డప్పు వాయిస్తున్న చల్లా రామచంద్రారెడ్డి, టీడీపీలో చేరిన వారితో మాట్లాడుతున్న చల్లా బాబు

పుంగనూరు రూరల్, ఏప్రిల్10: రాబోయే ఎన్నికల్లో పుంగనూరులో తెలుగుదేశం పార్టీ విజయం తథ్యమని, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ అభ్యర్థి చల్లారామచంద్రారెడ్డి జోస్యం చెప్పారు. బుధవారం పుంగనూరు మండలంలో ఆయన ఎన్నిక ప్రచారం నిర్వహించారు. ఏటవాకిలి పంచాయతీ పత్తెమ్మగారిపల్లెలో 50 కుటుంబాలు, బోడేవారిపల్లె పంచాయతీలో 50 కుటుంబాలు, నేతిగుంట్లపల్లె పంచాయతీలో 100కుటుంబాలు, భీమగానిపల్లె పంచాయతీలో 50 కుటుంబాలకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు చల్లా రామచంద్రారెడ్డి సమక్షంలో టీడీపీ కండువాలు కప్పుకుని పార్టీలో చేరారు. ఈ సందర్భంగా చల్లా బాబు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో జరిగిన అవినీతి, అక్రమాలు, దౌర్జన్యాలు, దోపిడీ, ఇసుక అక్రమ రవాణా తదితర అంశాలపై ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. 1983లో టీడీపీ ఆవిర్భావం సమయంలో ఎన్టీఆర్‌కు ప్రజల నుంచి వచ్చిన స్పందన ప్రస్తుతం మళ్లీ వస్తోందని, ఎక్కడ చూసినా ప్రజలు టీడీపీకి బ్రహ్మారథం పడుతున్నారని చెప్పారు. 25రోజుల్లో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ పార్టీ అభ్యర్థులకు ప్రజలు తగిన బుద్ధి చెప్పడానికి సిద్దంగా ఉన్నారని, టీడీపీ, బీజేపీ, జనసేన శ్రేణులు కలిసికట్టుగా వైసీపీ అరచాకాలను ప్రజలకు వివరించాలని కోరారు. వచ్చే ప్రభుత్వం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వమేనని ప్రజలందరూ ధైర్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాలను జనాలకు తెలియజేసి టీడీపీ పట్ల ఆకర్షితులయ్యేలా చూడాలన్నారు. రాష్ట్రం అభివృద్ధి సాధించాలంటే సీఎం చంద్రబాబు ప్రభుత్వం రావాలని, బీజేపీ సహకారంతో కేంద్రనిధులు అధికంగా రాష్ట్రానికి తెచ్చి అభివృద్ధి అంటే చేసి చూపిస్తారని తెలిపారు. సీఎం జగన్, వైసీపీ నాయకుల మాటలు విని ఎన్నికల్లో మోసపోరాదన్నారు. నూతనంగా టీడీపీలో చేరిన పార్టీ శ్రేణులకు అండగా ఉంటామన్నారు. పుంగనూరు టీడీపీ మాజీ ఇన్‌చార్జి ఎం.వెంకటరమణరాజు మాట్లాడుతూ వైసీపీకి ప్రజలు మళ్లీ అవకాశం ఇస్తే రోడ్లపై తిరిగే పరిస్థితి ఉండదన్నారు. ఇళ్లు, భూములను లాక్కొని బీహార్ రాష్ట్రంగా మన రాష్ట్రం మారిపోయే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న దాడులను దృష్టిలో పెట్టుకుని ప్రజలు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి, రాజంపేట పార్లమెంటు బీజేపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కాగా చల్లా రామచంద్రారెడ్డికి గ్రామాల్లో టీడీపీ శ్రేణులు, పూలవర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికారు. కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు మాధవరెడ్డి, శ్రీకాంత్, సుబ్రహ్మణ్యం రాజు, సీవీరెడ్డి, మోహన్‌రెడ్డి, వెంకటరెడ్డి, ప్రసాద్, దేశాది ప్రకాశ్, రమణ, ప్రసాద్, చంద్ర, కృష్ణానాయక్, నౌషాద్, ఇమ్రాన్, నూర్, శ్రీనివాసులు, డికె. శ్రీనివాసులు, రాఘవ, రవి, జనసేన నాయకులు విరూపాక్షి, చిన్నారాయల్, హరినాయక్, చైతన్యరాయల్, బాలాజీ నాయక్, పాముల హరి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సంపద సృష్టించి ప్రజా సంక్షేమం

మాజీ మంత్రి అమరనాథ రెడ్డి



పొలాల వద్ద ఉన్న రైతులను కలవడానికి వెళ్తున్న అమరనాథ రెడ్డి

గంగవరం, ఏప్రిల్ 10: రాష్ట్ర ఆదాయవనరులను పెంచి, తద్వారా వచ్చిన ఆదాయాన్నే ప్రజల సంక్షేమం కోసం ఖర్చు చేయడమే టీడీపీ ధ్యేయమని మాజీ మంత్రి అమరనాథ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం గంగవరం మండలం తాళ్లపల్లె పంచాయతీ ఏడూరు గ్రామంలో ఆయన పర్యటించారు. సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. పొలాల వద్ద ఉన్న రైతుల దగ్గరకు వెళ్లగా, మల్బరీనే నమ్ముకున్న మమ్మల్ని ఈ వైసీపీ ప్రభుత్వం ఇన్‌సెంటివ్‌లు ఇవ్వకుండా నట్టేట ముంచిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అమరనాథ రెడ్డి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో రైతులతో పాటు అన్నివర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురైన విషయం తెలిసిందేనన్నారు. ఈ దుర్మార్గ ప్రభుత్వాన్ని సాగనంపితేనే రాష్ట్ర భవిష్యత్తుతోపాటు ప్రజల భవిష్యత్తు బాగుంటుందన్నారు. ప్రజలందరూ టీడీపీని ఆదరించి గెలిపించాలన్నారు. తాళ్లపల్లె మాజీసర్పంచ్ లక్ష్మమ్మ కుమారుడు రమేష్‌రెడ్డి బుధవారం అమరనాథ రెడ్డి సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వైసీపీకి చెందిన రమేష్‌రెడ్డికి మాజీ మంత్రి అమరనాథరెడ్డి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సోమశేఖర్‌గౌడ్, విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రతాప్ రెడ్డి, వెంకట్రామిరెడ్డి, మురళి, హరిబాబు, రహీమ్, సర్దార్‌బాష, ఎస్సీసెల్ రవి, యుగంధర్, రెడ్డెప్ప, రఘు, కృష్ణారెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెద్దపంజాణి : కాంగ్రెస్ పార్టీ నాయకుడు పార్థసారధిరెడ్డిని ఆయన స్వగృహంలో అమరనాథరెడ్డి మర్యాద పూర్వకంగా కలిసారు. పెద్దపంజాణి మండలం వలసపల్లెలో ఆయనను కలిసి రానున్న ఎన్నికలలో తనకు సహకరించాలని కోరారు. అలాగే తుర్లపల్లెకు చెందిన వైసీపీ నాయకులు గంగారపు భానుప్రకాష్, సురేష్, రాజేష్, హరీష్‌ల ఆధ్వర్యంలో పెద్దఎత్తున అమరనాథరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు.

పలమనేరు : మాజీ మంత్రి అమరనాథరెడ్డి బుధవారం రాత్రి పలమనేరు మండలం పకీరుపల్లిలో ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లింలు అమరనాథరెడ్డికి శాలువాకప్పి సన్మానించారు. కార్యక్రమంలో నాగరాజరెడ్డి, జగదీష్‌నాయుడు, పెద్దబ్బ, మల్లీశ్వరరెడ్డి, వెంకటమునిరెడ్డి, అమరనాథరెడ్డి, గిరి, పాపిరెడ్డి, శ్రీనురెడ్డి, బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



భారతి(ఫైల్)

శాంతిపురం, ఏప్రిల్ 10: కుప్పం-పలమనేరు జాతీయ రహదారిలోని గుండశెట్టిపల్లె వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. స్థానికుల కథనం మేరకు... గడ్డూరు గ్రామానికి చెందిన చంద్రారెడ్డి భార్య భారతి(42) తన పుట్టినిల్లు అయిన గుండశెట్టిపల్లెకు తన మేనల్లుడు ద్విచక్ర వాహనంలో వెళుతుండగా కారు ఢీకొంది. భారతి తీవ్రంగా గాయపడగా ఆమె మేనల్లుడు స్వల్ప గాయాలతో బయట పడ్డాడు. భారతిని స్థానికులు కుప్పం పీఈఎస్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో వైద్యులు పరీక్షించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వారు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

జగన్‌తో యూడీసీ సెల్ఫీ హల్‌చల్ !



చౌడేపల్లె, ఏప్రిల్ 10:చౌడేపల్లె ప్రభుత్వాసుపత్రిలో యూడీసీగా పనిచేస్తున్న రెడ్డెప్పరెడ్డి ఫొటో సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. ఈనెల 2న మదనపల్లెలో జరిగిన సీఎం సిద్ధం సభ నుంచి బస్సు యాత్ర చౌడేపల్లె మీదుగా సదుం మండలం అమ్మగారిపల్లె వరకు సాగింది. ఈక్రమంలో ఈనెల 3న రెడ్డెప్పరెడ్డి అమ్మగారిపల్లెకు వెళ్లి అక్కడ సీఎంతో సెల్ఫీ తీసుకున్నట్లు సమాచారం. ఆ ఫొటో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుండటంతో ప్రభుత్వ అధికారులు రాజకీయ నాయకుల సమావేశానికి వెళ్లి క్యాంపెనర్లుగా పని చేయడం ఎన్నికల కోడ్ ఉల్లంఘన కిందికి రాదా అని పలువురు విమర్శిస్తున్నారు. ఈ విషయమై ఆయనను వివరణ కోరగా ఫొటోలో ఉన్న వ్యక్తి నేను కాదు అని సమాధానం ఇచ్చారు. పీహెచ్‌సీ సిబ్బందిని ఆరా తీయగా ఆ ఫొటో రెడ్డెప్పరెడ్డిదేనని, సీఎంను కలసినప్పుడు 152 సీట్లు వైసీపీ గెలుస్తుందని సీఎం చెప్పినట్లు యూడీసీ రెడ్డెప్పరెడ్డి సిబ్బందితో చెప్పటం గమనార్హం.

పుంగనూరులో బీసీవై పార్టీ నాయకుల ప్రచారం



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బీసీవై పార్టీ నాయకులు

పుంగనూరు, ఏప్రిల్10: మంచి పరిపాలన, అభివృద్ధి జరగాలంటే పుంగనూరు ప్రజలు బీసీవై పార్టీ అభ్యర్థి బోడే రామచంద్రయాదవ్‌ను గెలిపించాలని ఆ పార్టీ నాయకులు ఎన్నికల ప్రచారం చేశారు. బుధవారం పుంగనూరు పట్టణంలోని 13, 14, 16, 17, 24, 25 వార్డుల్లో పర్యటించి బీసీవైపార్టీ మ్యానిఫెస్టో కరపత్రాలను ఇంటింటికి అందజేశారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆర్.హరినాథరెడ్డి, బీసీవైపీ నేతలు సాంబమూర్తి, రమేశ్ యాదవ్ మాట్లాడుతూ బీసీవై పార్టీని గెలిపిస్తే ఉచితంగా ఇంటికి ఒక పాడి ఆవు, యువతకు ఉపాధి కల్పించడానికి పరిశ్రమలు, పుంగనూరులో సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి, మండలాల్లో డెయిరీలు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. బీసీవైపీ నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, నారాయణస్వామి, సమీవుల్లా, శివకుమార్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత హస్తకళా ప్రదర్శనకు విశేష స్పందన



వస్తువులను కొనుగోలు చేస్తున్న నగరవాసులు

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 10: స్థానిక పలమనేరు రోడ్డులోని సీ.ఎం కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న చేనేత హస్తకళా ప్రదర్శనకు నగరవాసుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ప్రదర్శనలో పోచంపల్లె, కళాంకారి, మంగళగిరి, పొందూరు, బెంగాల్, హైదరాబాద్, గద్వాల్, వెంకటగిరి, దావణగెరె, హర్యానా, జైపూర్‌కు చెందిన చేనేత, ఖాదీ, చీరలు, పంచెలు, డ్రస్ మెటీరియల్స్ వినియోగదారులకు నరసమైన ధరలకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతితో లభిస్తుండటంతో నగరవాసులు కొనుగోళ్లు చేస్తున్నారు. చిన్నారులకు ఆట వస్తువులు, గృహోప అలంకరణలకు అవసరమయ్యే వస్తువులు, వంట సామగ్రి, తిను బండారాలు, డోర్ కర్టెన్స్, యువతకు అవసరమయ్యే డ్రస్సులు, వన్ గ్రామ్ గోల్డ్ నగలు, ఇతరత్రా అతి చౌక ధరలకు లభిస్తున్నాయి. ఈ ప్రదర్శనను ఈనెల 16వ తేదీ వరకు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు లక్ష్మణ్ తెలిపారు.

మురళీమోహన్‌ను ఎమ్మెల్యేగా గెలిపించండి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

తవణంపల్లె, ఏప్రిల్ 10: పూతలపట్టు ఎమ్మెల్యేగా మురళీమోహన్‌ను గెలిపించాలని తవణంపల్లె టీడీపీ నాయకులు కోరారు. బుధవారం మండలంలోని దిగువమత్యం, ఎగువమత్యం, జోగిండ్లు తదితర గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సైకిల్ గుర్తుకు ఓటు వేసి టీడీపీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. టీడీపీ మండల అధ్యక్షుడు గాలి దిలీప్, మాజీ జడ్పీటీసీ వెంకటేష్‌చౌదరి, మండల ప్రధాన కార్యదర్శి మధుకుమార్, టీడీపీ అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్, నాయకులు భాస్కర్ నాయుడు, మోహన్ నాయుడు, సునీల్ కుమార్, శరవణ, గోపి, దాము, ప్రకాష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు



కేఆర్ పాలెంలో ఇంటింటి ప్రచారంలో టీడీపీ నాయకులు

నింద్ర, ఏప్రిల్ 10: మండలంలోని కూనమరాజపాలెం పంచాయతీకి చెందిన వైసీపీ నాయకులు రాజేంద్ర నాయుడు, కృష్ణారెడ్డి, కృష్ణమ నాయుడు, పురుషోత్తం నాయుడు తమ అనుచరులతో బుధవారం టీడీపీ కండవా కప్పుకుని పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ గెలుపునకు కృషి చేస్తామని తెలిపారు. అదేవిధంగా మండంలోని కూనమరాజుపాలెం, కైపాకం గ్రామ పంచాయతీల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశ్వరరావు, కార్యదర్శి విజయ్‌కుమార్, నాయకులు రవి నాయుడు, రవికుమార్, జయచంద్రరాజు, వాసు నాయుడు, దయాలన్, బీజేపీ నాయకులు రమేష్, బాలకృష్ణ, జనసేన శివ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా టీడీపీ కార్యాలయానికి ప్రింటర్ వితరణ



ప్రింటర్‌ను విరాళంగా ఇస్తున్న కిషోర్ నాయుడు

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 10: టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ మిత్రుడు జీకే గ్రూప్ బిల్డర్ అధినేత గుంటూరు కిషోర్ నాయుడు జిల్లా టీడీపీ కార్యాలయానికి రూ.50 వేల విలువచేసే ప్రింటర్‌ను బుధవారం విరాళంగా ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్, ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, రాష్ట్ర పార్టీ కార్యదర్శి సురేంద్రకుమార్, నేతలు సప్తగిరి ప్రసాద్, కృష్ణమ నాయుడు, శ్రీధర్ యాదవ్, నాగేశ్వరరాజు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల పందకాలు ఏర్పాటు



పందకాలు ఏర్పాటు చేస్తున్న ఆలయ నిర్వాహకులు

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 10: నగరంలో అత్యంత ప్రాశస్త్యం పొందిన కోదండ రామాలయ శ్రీరామనవమి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 14 నుంచి ప్రారంభం కానున్నాయి. అందుకు గాను బుధవారం ఉదయం ఆలయం ఎదుట ఉత్సవ పనులకు నాంది సూచకంగా పందకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితుల మంత్రోచ్ఛారణలతో అర్చకులు వేణుగోపాల్ పందకాలు ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో ఈవో సుబ్రమణ్యం నాయుడు, మాజీ పాలకమండలి సభ్యులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు, ఇదిలా ఉండగా గిరింపేట వీరాంజనేయస్వామి ఆలయంలో గత రెండు రోజులుగా స్వామివారి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం స్వామివారు లక్ష్మీనారాయణ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

వైసీపీ నేతల ఒత్తిడితోనే వలంటీర్ల రాజీనామాలు

● ఆమోదించకుండానే ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్న వారిపై చర్యలు తీసుకోవాలి: టీడీపీ

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 10: వైసీపీ నాయకుల ఒత్తిడితోనే చిత్తూరు రూరల్ మండలంలో వలంటీర్లు రాజీనామా చేస్తున్నారని మండల టీడీపీ నాయకులు ఆరోపించారు. బుధవారం మండల టీడీపీ కార్యాలయంలో వారు విలేకర్లతో మాట్లాడుతూ మండలంలోని తుమ్మింద, పచ్చనపల్లి, పెద్దిశెట్టిపల్లి, గువ్వకల్లు, చింతలగుంట తదితర పంచాయతీల్లో పనిచేస్తున్న వలంటీర్లను వైసీపీ నాయకులు బలవంతంగా రాజీనామా చేయించారని అన్నారు. వారి రాజీనామాలను అధికారులు ఆమోదించకుండానే వైసీపీ తరపున ప్రచారంలో పాల్గొంటున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. వలంటీర్లు కూడా ఆలోచించాలని, టీడీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే రూ.5 వేలు ఉన్న గౌరవ వేతనాన్ని రూ.10 వేలు చేస్తారని పేర్కొన్నారు. టీడీపీ నాయకులు మోహన్‌రాజ్, శశికర్‌బాబు, రాజా, సరేష్, కరుణాకర్, బాబు పాల్గొన్నారు.

గర్భిణులు వేసవి కాలంలో జాగ్రత్తలు పాటించాలి

పాలసముద్రం, ఏప్రిల్ 10: గర్భిణు వేసవికాలంలో జాగ్రత్తలు పాటించాలని డాక్టర్ మోహనకృష్ణ పేర్కొన్నారు. బుధవారం పాలసముద్రం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మండలంలోని గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలంలో గర్భిణులు ఎండలో తిరగరాదని, మాంసాహారానికి దూరంగా ఉండాలన్నారు. బీపీ, రక్తపరీక్షలు నిర్వహించి, వారికి కావాల్సిన మందులను పంపిణీ చేశారు. గర్భిణులు ప్రభుత్వాస్పత్రుల్లోనే కాన్పులు చేయించుకోవాలన్నారు. సీహెచ్‌వో జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్ మురళి, ఏఎన్‌ఎంలు లక్ష్మి, అరుణ, గంగ తదితరులు పాల్గొన్నారు.

బాలిక ఆత్మహత్య కేసులో నిందితుడి అరెస్ట్

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 10: బాలిక ఆత్మహత్య కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు అర్బన్ సీఐ రాఘవరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 7వ తేదీ పుంగనూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక (17)ను అదే గ్రామానికి చెందిన గణేశ్ అత్యాచార యత్నానికి ప్రయత్నించగా బాలిక కేకలు వేయడంతో అతడు పరారీ అయ్యాడు. దీంతో బాలిక మనస్థాపానికి గురై ఉరివేసుకుని మృతి చెందినట్లు ఆయన వివరించారు. దీంతో అతడిపై పోక్సోతో పాటు వివిధ నేరాల కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన జేసీ

చిత్తూరు, ఏప్రిల్ 10: చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని జేసీ శ్రీనివాసులు ఆదేశించారు. బుధవారం నగరపాలక సంస్థ పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను కమిషనర్ అరుణ, తహసీల్దార్ శ్రీనివాసులురెడ్డిలతో కలిసి పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలలో విద్యుత్, ఫర్నీచర్, తాగునీరు, మరుగుదొడ్లు, వీల్‌చైర్ ర్యాంపులు, ఇంటర్నెట్ వంటి సదుపాయాలు ఉన్నాయా లేదో పరిశీలించాలని, చిన్నచిన్న సమస్యలుంటే వెంటనే పూర్తిచేయాలని ఆదేశించారు. బాపు బాలభవన్, పీసీఆర్ ప్రభుత్వ పాఠశాల, జానకారపల్లె తదితర పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.

ఎంహెచ్‌వోగా అనిల్‌కుమార్ నాయక్

చిత్తూరు, ఏప్రిల్ 10: చిత్తూరు నగరపాలక సంస్థ మెడికల్ హెల్త్ ఆఫీసర్ (ఎంహెచ్‌వో)గా అనిల్‌కుమార్ నాయక్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఎంహెచ్‌వోగా ఉన్న లోకేష్‌ను ప్రభుత్వానికి సరెండర్ చేశారు. ఆయన స్థానంలో అనిల్‌కుమార్ బాధ్యతలు తీసుకున్నారు.

టీడీపీ అభ్యర్థులను గెలిపించండి



వెలుతురుచేనులో కరపత్రాలను పంపిణీ చేస్తున్న మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్

బంగారుపాళ్యం, ఏప్రిల్ 10: మండలంలోని వెలుతురు చేను పంచాయతీలో మండల అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్ ఆధ్వర్యంలో సూపర్‌సిక్స్ పథకాలను ఇంటింటికీ తిరిగి ప్రజలకు వివరించారు. టీడీపీ ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్‌లకు ఓటువేసి గెలిపించాలని కోరారు. జయచంద్ర నాయుడు, గజపతి, జనార్దన్ గౌడ్, ఎన్‌వీ నవీన్ చౌదరి, వెలుతురుచేను గ్రామస్తులు రవి, మురుగ, రమేష్, వజ్రవేల్ పాల్గొన్నారు.

'స్వామి' సొంత శాఖకు సొంత భవనం కావలెను..!



కార్వేటినగరంలో ఎక్సైజ్ సర్కిల్ భవనం

కార్వేటినగరం, ఏప్రిల్ 10: రాష్ట్ర ఎక్సైజ్ శాఖకు బాధ్యత వహిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణ స్వామి సొంత మండలంలో ఎక్సైజ్ శాఖకు సొంత భవనం కావాల్సిన పరిస్థితి ఏర్పడింది. కార్వేటినగరం సమితి కేంద్రంగా ఉన్నప్పుడు ఖాళీగా ఉన్న భవనంలో ప్రభుత్వ ఎక్సైజ్ సర్కిల్ కేంద్రాన్ని నిర్వహించేవారు. ఎక్సైజ్ శాఖ భవనం శిథిలావస్థకు చేరుకుంది. దీనితో పక్కనే ఉన్న ప్రభుత్వ సెరికల్చర్‌కు చెందిన భవనానికి కొద్దిపాటి మరమ్మతులు చేపట్టి ఎక్సైజ్ శాఖ కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. అయితే సొంత మండలంలో, సొంత శాఖకు సంబంధించి సొంత భవనం నిర్మించలేని డిప్యూటీ సీఎం ప్రజా సేవ ఏమి చేస్తారోనని స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

బటన్ నొక్కినెలైంది..

డబ్బులేవీ: టీడీపీ

పెనుమూరు, ఏప్రిల్ 10: వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అభివృద్ధిని పక్కన పెట్టి బటన్ నొక్కి ప్రజలను మభ్యపెడుతూ వచ్చారని మాజీ ఎంపీపీ హరిబాబు నాయుడు అన్నారు. బుధవారం ఆయన పెనుమూరులో మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కులాల్లోని 45 ఏళ్లు నిండిన మహిళలకు చేయూత పథకం ద్వారా గత ఏడాది ఇవ్వవలసిన రూ.18,750 ఇంత వరకు ఇవ్వలేదన్నారు. ఎన్నికల కోడ్‌కు ముందు జగన్ బటన్ నొక్కినా ఇంత వరకు మహిళల ఖాతాలో జమ ఎందుకు కాలేదని ఆయన ప్రశ్నించారు. పెనుమూరు మండలంలో 1928 మంది లబ్ధిదారులకు రూ.3,61,50,000 రావాలని, జగన్ బటన్ నొక్కి నెలవుతున్నా పడలేదని అన్నారు. జగన్‌కు రాబోవు ఎన్నికల్లో మహిళలందరూ తగిన బుద్ధి చెబుతారని అన్నారు.

టీడీపీ తీర్థం పుచ్చుకున్న వైసీపీ కార్యకర్తలు



భానుప్రకాష్‌తో టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు

విజయపురం, ఏప్రిల్ 10: మండలంలోని ఆలపాకం పంచాయతీ ముత్తప్పరెడ్డి కండ్రిగకు చెందిన 30 మంది వైసీపీ కార్యకర్తలు నగరి టీడీపీ కార్యాలయంలో బుధవారం ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ సమక్షంలో తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. భానుప్రకాష్ మాట్లాడుతూ వైసీపీకి కంచుకోటగా పేరుగాంచిన గ్రామంలో ఇంత మార్పు రావడం ఆనందంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ పార్టీ విజయానికి కృషి చేయాలని చెప్పారు. మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్ రాజు, ఉపాధ్యక్షుడు రవిచంద్రారెడ్డి, నాయకులు శివలింగం, గాలి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



రమేష్‌బాబును పరామర్శిస్తున్న భానుప్రకాష్

నగరి పట్టణ టీడీపీ అధ్యక్షుడికి భాను పరామర్శ

నగరి, ఏప్రిల్ 10: నగరి పట్టణ టీడీపీ అధ్యక్షుడు రమేష్‌బాబు అనారోగ్యంతో బాధ పడుతుండటంతో ఆయనను భానుప్రకాష్ బుధవారం పరామర్శించారు. ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలని సూచించారు. రాష్ట్ర టీఎన్‌టీయూసీ కార్యదర్శి బాలాజీ పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్ కరపత్రాల పంపిణీ

నగరి, ఏప్రిల్ 10: నగరి మండల పరిధిలోని కృష్ణారామాపురంలో బుధవారం మండల టీడీపీ నాయకులు శివకుమార్‌రెడ్డి, టీఎన్‌టీయూసీ బాలాజీల ఆధ్వర్యంలో సూపర్‌సిక్స్ కరపత్రాలను ఇంటింటా పంపిణీ చేశారు. సీనియర్ నాయకులు శ్రీనివాసులురెడ్డి, నారాయణస్వామి నాయుడు, గోవిందస్వామి,పరంధామ నాయుడు, చిత్తూరు బాబు నాయుడు, కన్నెప్ప పాల్గొన్నారు.

విజయపురం: మండలంలోని జగన్నాథపురం, కృష్ణసముద్రంలో రాష్ట్ర టీడీపీ బీసీ సెల్ అధికార ప్రతినిధి చుక్కా ధనుంజయయాదవ్ ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. జగన్నాథపురంలో పది మంది వైసీపీ కార్యకర్తలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

పూతలపట్టు, ఏప్రిల్ 10: డివైడర్‌ను కారు ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. తిరుపతి పట్టణం లక్ష్మీపురం సర్కిల్‌కు చెందిన దీపక్ రెడ్డి (23) తన సోదరుడితో కలిసి బుధవారం మధ్యాహ్నం పూతలపట్టు మండలం కిచ్చన్నగారిపల్లె వద్ద వున్న సిక్స్ లేన్ రోడ్డులో కారులో బెంగళూరు వెళుతుండగా, అకస్మాత్తుగా కారు డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో దీపక్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని 108 సిబ్బంది చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు. పూతలపట్టు సీఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

పాలసముద్రం, ఏప్రిల్ 10: మండలంలోని తిరుమలరాజుపురంలో బుధవారం పేకాట ఆడుతున్న ఏడుగురిని పాలసముద్రం ఎస్ఐ భారతి అరెస్టు చేసి, రూ.15,770ను స్వాధీనం చేసుకున్నారు.అరెస్టయినవారిలోశ్రీకుమార్,రుద్రమూర్తి, వినాయకం, స్వామిదాస్, సి.కె. నాథన్, యోగానందం, కార్తికేయన్‌లు ఉన్నారు. ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

12, 13 తేదీల్లో నియోజకవర్గాల వారీగా ఈవీఎంల ర్యాండమైజేషన్: కలెక్టర్



ఈవీఎం గోదాములను తనిఖీ చేస్తున్న కలెక్టర్, ఎస్పీ

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 10: లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాలవారీగా విడివిడిగా ఈవీఎంల ర్యాండమైజేషన్ ఈనెల 12, 13వ తేదీల్లో కలెక్టరేట్‌లో గట్టి పోలీసు బందోబస్తు మధ్య చేపడుతున్నట్లు కలెక్టర్ షన్మోహన్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని రెండు ఈవీఎం గోదాములను ఆయన ఎస్పీ మణికంఠ చందోలు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ, కలెక్టర్ గోదాముల్లో ఈసీఐ కంపెనీ నుంచి అందిన పోలింగ్ మెటీరియల్స్ బ్యాగులను, ఈవీఎం, వీవీప్యాట్లను పరిశీలించగా, ఎన్నికల్లో వాటి ప్రాముఖ్యతను ఎలక్షన్ ఐటీ వింగ్ అధికారి ఉమాపతి వారిరువురికి వివరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో పుల్లయ్య, డ్వామా పీడీ రాజశేఖర్ నోడల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ పనులను పరిశీలించిన కమిషనర్

చిత్తూరు, ఏప్రిల్ 10: నగరంలోని దర్గా కూడలిలో జరుగుతున్న ఇంజనీరింగ్ పనులను బుధవారం కమిషనర్ అరుణ పరిశీలించారు. ఈ నెల 14వ తేదీన అంబేద్కర్ జయంతి కార్యక్రమం జరుగుతున్న నేపథ్యంలో అంబేద్కర్ విగ్రహం చుట్టూ జరుగుతున్న పునర్నిర్మాణ పనులను పరిశీలించారు. త్వరగా పనులను పూర్తి చేసి గ్రీనరీని పెంచాలన్నారు. కమిషనర్ వెంట ఎంఈ గోమతి, డీఈ రమణ, ఏఈ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల సంక్షేమానికి టీడీపీ పెద్దపీట

● ఇఫ్తార్ విందులో జీజేఎం స్పష్టం



ఇఫ్తార్ విందులో గురజాల జగన్మోహన్ తదితరులు

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 10: చిత్తూరు నియోజకవర్గ టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. బుధవారం నగరంలోని 4వ డివిజన్ కట్టమంచిలోని మసీదులో ముస్లిం సోదరులతో కలసి దువా చేసి, విందులో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ముస్లింల సంక్షేమానికి టీడీపీ పెద్దపీట వేసిందన్నారు. ఇమామ్, మౌజన్‌లకు వేతనాలు ఇవ్వడంతో పాటు హజ్ యాత్రకు నిధులు కేటాయించిందని చెప్పారు. టీడీపీ హయాంలో రంజాన్ తోఫా అందించి ముస్లింల కళ్లలో ఆనందం నింపారని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో ముస్లిం మైనార్టీలు టీడీపీ కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు ఓట్లు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, నేతలు త్యాగరాజన్, బాబురెడ్డి, జాఫర్, అన్సర్, శివ, సురేష్, గోకుల్, బీజేపీ, జనసేన నేతలు పాల్గొన్నారు.

టీడీపీలోకి వైసీపీ కార్యకర్తల చేరిక

టీడీపీలోకి పలువురు వైసీపీ కార్యకర్తలు చేరారు. బుధవారం బీవీ రెడ్డి కాలనీలోని జీజేఎం కార్యాలయంలో ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ ఆధ్వర్యంలో గుడిపాల మండలం వెంగమాంబపురం పంచాయతీకి చెందిన పలువురు వైసీపీ నేతలు టీడీపీలో చేరారు. వీరికి గురజాల టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గురజాల మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థి అయిన తనను, ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావును అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో సునీల్ కుమార్, జయకుమార్, సెల్వరాజ్, ప్రభుదేవా, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ అభ్యర్థులను గెలిపించాలి: ప్రతిమ

చిత్తూరు సిటీ: వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్, ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావుకు ఓట్లు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని జగన్మోహన్ సతీమణి ప్రతిమ కోరారు. బుధవారం నగరంలోని కయనికట్టువీధి, ఖాదర్ మీరా వీధి, చింతమాను వీధి, పెద్ద హరిజనవాడ, ఎంఎం కోవిల్ స్ట్రీట్, శేషాపిరాన్ వీధి, అమ్మన్‌కోవిల్ స్ట్రీట్‌లలో తెలుగుమహిళలతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

బీజేపీ ఇంటెలెక్చువల్ జిల్లా కన్వీనర్‌గా మణి నాయుడు



నియామక పత్రం అందుకుంటున్న మణినాయుడు


చిత్తూరు (సెంట్రల్), ఏప్రిల్ 10: బీజేపీ ఇంటెలెక్చువల్ చిత్తూరు జిల్లా కన్వీనర్‌గా టీసీ మణి నాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు నియామక పత్రాన్ని జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జగదీశ్వర్ నాయుడు, శ్రీనివాసులు బుధవారం పార్టీ కార్యాలయంలో ఆయనకు అందజేశారు. బీజేపీ నాయకులు రాజేంద్రన్, చంద్రబాబు తదితరులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

అలరించిన హరికథా గానం

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 10: నగరపాలక పరిధిలోని 21వ డివిజన్ కుక్కలపల్లె లక్ష్మయ్యకండ్రిగ ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో గత 14 రోజులుగా మహాభారత ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. బుధవారం ఇలావంతుడి వధ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రముఖ హరికథ కళాకారిణి సీతాలక్ష్మి తన గానంతో భక్తులను అలరించారు. సాయంత్రం వెంకటేశ్వర నాటక కళామండలి సభ్యులచే నాటక ప్రదర్శన జరిగింది. గురువారం ద్రౌపది కల్యాణం, పట్టాభిషేకంతో మహాభారత ఉత్సవాలు ముగుస్తాయి. పూల సుబ్రమణ్యం నాయుడు, కుమారస్వామి నాయుడు, హరి నాయుడు, రవి నాయుడు, రామచంద్రయ్య, గోవిందయ్య తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు అన్నదానం

బంగారుపాళ్యం, ఏప్రిల్ 10: మండలంలోని బీపీఎన్‌కే కాంప్లెక్స్ వద్ద బుధవారం కీరమంద గ్రామానికి చెందిన సుధాకర్ కుమారుడు అశోక్ కుమార్ జ్ఞాపకార్థం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనార్దన్ గౌడ్, బాబు, రమేష్, శ్రీనివాసులు, కీరమంద గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న టీడీపీ నాయకులు

భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు



షియాముస్లింలను ఉద్దేశించి మాట్లాడుతున్న డివిజన్ ప్రభుత్వ ఖాజీ (మతగురువు) మౌలానా అలీ అక్బర్

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 10: మండలంలోని వేర్వేరు గ్రామాల్లో షియా ముస్లిం కుటుంబాలకు చెందినవారు భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని తూగుండ్రం పంచాయతీ ఆవలకొండలో అంజుమన్ అబ్బాషియా కమిటీ అధ్యక్షుడు నియాజ్‌అలీ, అబ్బాషియా చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ గులామ్ హుస్సేన్ ఆధ్వర్యంలో అజాఖానా జహిరాలో ఉదయం ఖురాన్‌లోని భక్తి సందేశాన్ని తెలియజేశారు. ఈద్గా వద్ద మధ్యాహ్నం ఉపవాస దీక్ష, రంజాన్ పండుగ విశేషాలను చిత్తూరు డివిజన్ ప్రభుత్వ ఖాజీ, మతగురువు(మిర్జా) మౌలానా అలీ అక్బర్ వివరించారు. గంగాధరనెల్లూరు అబ్బాస్‌కాలనీలో మతగురువు విరాసత్ అలీ, బాలగంగనపల్లెలో మతగురువు సయ్యద్ ఖాసీం అబ్బాస్ ఆధ్వర్యంలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. జాఫర్‌అలీ, ఆషక్‌అలీ, యగ్బాల్ హుస్సేన్, రహమత్ అలీ, షాకీర్‌అలీ, మెహిదిఅలీ, బాబు, ముజ్జు, అంజత్‌అలీ, నబీల్‌రజా, కుమేల్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వండి



డీఆర్వోకు వినతిపత్రం అందజేస్తున్న ఆపస్ సంఘ నేతలు

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 10: త్వరలో జరుగనున్న సాధారణ ఎన్నికల విధుల్లో పలువురు ఉపాధ్యాయులకు ఎన్నికల విధులు కేటాయించడం జరిగిందని, వారిలో దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు, గర్భిణులు, ప్రమాదాలు జరిగి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నవారు, బాలింతలు, ఆరు నెలల్లో పదవీ విరమణ చేయనున్నవారు, 80శాతం అంగవైకల్యం ఉన్నవారు ఉన్నారని, వీరికి ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని ఆపస్ సంఘ నాయకులు డీఆర్వో పుల్లయ్యను కోరారు. బుధవారం రాత్రి ఆపస్ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ, ఇతర పాలకవర్గ సభ్యులు కలిసి డీఆర్వోకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పలువురికి పీవో, ఏపీవో, ఓపీవోలుగా విధులు కేటాయించినట్లు తెలిసిందన్నారు. మానవతా దృష్టితో వారిని ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. మినహాయింపుల గూర్చి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి తగు న్యాయం చేస్తామని డీఆర్వో వారికి హామీయిచ్చారు. ఆపస్ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మంజునాథ్, విజయ్, సాంబిరెడ్డి, దేవరాజులు, దాము, గోపి, రాధాకృష్ణ, గిరీష్ ఉన్నారు.

ఆరోగ్య ఉప కేంద్రాన్ని సందర్శించిన డాక్టర్ రవిరాజు

కార్వేటినగరం, ఏప్రిల్ 10: ఈదువారిపల్లె ఆరోగ్య ఉపకేంద్రాన్ని బుధవారం జిల్లా ప్రభుత్వ వైద్య టీకాల అధికారి డాక్టర్ రవిరాజు సందర్శించారు. పసిపిల్లలకు వేస్తున్న టీకాలు కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. వేసవిలో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి స్థానికులకు అవగాహన కల్పించారు.

కాంగ్రెస్ హయాంలోనే ఏపీ అభివృద్ధి



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి రమేష్‌బాబు

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 10: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందడంతో పాటు ప్రజలకు వివిధ రకాల సంక్షేమ పథకాల ద్వారా చేయూతనిచ్చినట్లు డిప్యూటీ సీఎం నారాయణస్వామి మేనల్లుడు, గంగాధరనెల్లూరు నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డి. రమేష్‌బాబు అన్నారు. గంగాధరనెల్లూరులో బుధవారం సాయంత్రం ఆయన ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటశివను కలిసి ఎన్నికల ప్రచారం, ప్రచారానికి కావాల్సిన వాహనాల అనుమతి కోసం కలిసి దరఖాస్తులను అందజేశారు. అనంతరం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తనను కాంగ్రెస్‌పార్టీ తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించినందుకు పీసీసీ అధ్యక్షురాలు షర్మిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈసమావేశంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు చందురాణి, జిల్లా ఉపాధ్యక్షుడు కన్నన్, జిల్లా ప్రధానకార్యదర్శి చంద్రబాబు, మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు వాసు, నేతలు శివకుమార్, గోవర్ధన్, మురళి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అభ్యర్థి ఖర్చు రూ.40లక్షలకు మించరాదు

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 10: అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేసే వ్యక్తి రూ.40లక్షలకు మించి ఖర్చుచేయరాదని ఎన్నికల రిటర్నింగ్ అధికారి సి.వెంకటశివ చెప్పారు. గంగాధరనెల్లూరు తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం నియోజకవర్గంలోని వివిధ రాజకీయ పార్టీల నేతలతో ఆర్వో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేగా పోటీచేసే అభ్యర్థులు వారి నామినేషన్ దరఖాస్తులను ఒకటికి రెండుసార్లు చదివి తద్వారా వివరాలను రాయాలన్నారు. అభ్యర్థికి సంబంధించి ఖర్చుల వివరాలు పరంగా బిల్లులు కచ్చితంగా ఉండాలన్నారు. ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రవి, డిప్యూటీ తహసీల్దార్ తులసీరామ్, రాష్ట్ర బీజేపీ ఓబీసీ కార్యవర్గ సభ్యుడు ఇడగట్టి సుధాకర్, జిల్లా కాంగ్రెస్‌పార్టీ ప్రధానకార్యదర్శి చంద్రబాబు, ఉపాధ్యక్షుడు కన్నన్, మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు వాసు పాల్గొన్నారు.

పేదల కడుపు నింపడానికే అన్నదానం

గుడిపాల, ఏప్రిల్ 10: నిరుపేదల కడుపు నింపడానికే అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు అన్నారు. బుధవారం మాజీ మండల టీడీపీ అధ్యక్షుడు, దివంగత మద్రాసుబాబు అలియాస్ వి.కె. విజయ్‌కుమార్ 17వ వర్ధంతి సందర్భంగా ఆయన సోదరుడు వి.కె. ప్రభుకుమార్, కుటుంబ సభ్యులు, ఆయన అభిమానులు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు హేమాద్రి నాయుడు, అనిల్‌కుమార్, చంద్రమోహన్, జగదీశ్వర నాయుడు, రవి నాయుడు, కేబీ ప్రసాద్, చల్లా, అరుణ్, గోపి, సాంబశివ నాయుడు, నరసింహులు, గోవింద గౌడు, ఏకాంబరం, మనోజ్, శంకర్ చౌదరి, కిట్టు, బోడెబ్బ నాయుడు తదితరులు పాల్గొన్నారు.